ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం
వార్త
సోమవారం 13, మే 2024 16 పేజీలు



# పోలింగ్‌కు సర్వం సన్నద్ధం



16 వ పేజీలో...

ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త:

పోలింగ్ సామాగ్రి పంపిణీ పూర్తి
ఉభయ జిల్లాల్లో
మహిళా ఓటర్లే కీలకం
పటిష్ట పోలీస్ బందోబస్తు
నడుమ ఎన్నిక
ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ప్రత్యేక
పోలీస్ బృందాల పహారా






4వ పేజీలో...

భద్రాచలం ఏజెన్సీలో ఎన్నికలకు

## సర్వం సిద్ధం

-ఉద్యోగులకుఎన్నికల సామాగ్రి పంపిణీ
-భద్రాచలం నియోజకవర్గంలో 176 పోలింగ్ కేంద్రాలు
-ఏజెన్సీలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు



8వ పేజీలో...

## రూ.కోటి స్వాధీనం

వాహనాన్ని వెంబడించిన పోలీసులు
అదుపుతప్పి బోల్తా కొట్టిన ఇన్నోవా



8వ పేజీలో...

ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తే

## కఠిన చర్యలు

ఓటర్లు స్వేచ్ఛగా ఓటింగ్‌లో పాల్గొనండి
కలెక్టర్, రిటర్నింగ్ అధికారి వి.పి.గౌతమ్

# నోట్ల మూటలు విప్పిన పార్టీల నేతలు

## పోటాపోటీగా ఓటర్లకు నోట్లు పంపిణీ

## నియంత్రించలేని నిఘా నేత్రాలు

**సత్తుపల్లి, మే 12, ప్రభాతవార్త:**
ఖమ్మం పార్లమెంట్ ఎన్నికలు సోమవారం జరుగుతుండటంతో రంగంలో ఎంపి అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వివిధ పార్టీలకు చెందిన నేతలు ఎవరికి వారే గెలవాలనే పట్టుదలతో చివరి అంఖమైన పోలింగ్‌కు పెద్ద ఎత్తున నగదు పంపకాలు ప్రారంభించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన దగ్గరి నుండి నామినేషన్‌ల అంకం మొదటి ప్రక్రియ పూర్తికాగా, రెండవ అంకం ప్రచార కార్యక్రమం పూర్తి కావడంతో మూడవ అంకం పోలింగ్ ఇదే పార్టీలకు కీలకం. ఈ అంకానికి నేతలు నోట్ల మూటలు విప్పి ఓటర్లను నోటు ద్వారా ప్రసన్నం చేసుకుంటున్నారు. ఎన్నికల కమిషన్ ఓటర్లు ప్రశాంతంగా, స్వేచ్ఛగా వారి ఓటు హక్కు వినియోగించుకునేలా పోలీస్‌చెక్ పోస్టులు, నిఘా యంత్రాలను గట్టి ముమ్మరం చేసినప్పటికీ ఈ నిఘా యంత్రాలకు పార్టీ నేతలకు నోట్ల పంపకాల విషయంలో అదుపుచేయ లేకపోయారనే విమర్శలు వస్తున్నాయి. పార్టీ నేతలు వ ఎవరికి వారు తమ అభ్యర్థులను గెలిపించుకోవాలని, నోట్ల పంపకాల విషయంలో పోటా పోటీగా గ్రామాల్లో రాత్రి, పగలు తేడా లేకుండా పంపకాలకు తెర లేపారు.



**మధ్య దళారుల హవా...... !**

ఎన్నికలు సమీపిస్తున్నాయంటే గ్రామాల్లో కొందరు రాజకీయ బ్రోకర్లకు పండగే పండగ . వీరు పార్టీ నాయకుల చుట్టూ వేళా పాల లేకుండా తిరుగుతూ నమ్మకంగా ఉంటూ ఓటుకు నోట్లు ఇచ్చే సమయంలో ఈ బ్రోకర్ల హడావిడి అంతా ఇంతా కాదు. గ్రామంలో నావాళ్ళు 100, 200 కుటుంబాల వారు ఉన్నారు వీరందరినీ నేను చూసుకుంటానని నమ్మించి నేతల దగ్గర లక్షలాదిరూపాయలు పంపకాల పేరుతో తీసుకొని తీరా ఓటర్లకు ఉత్త చేయి చూపిస్తూ గ్రామాల్లో చెలామణయ్యేఈ బ్రోకర్లు నేటి ఎన్నికల సమయంలో పుట్టుకొస్తున్నారు. ఇలాంటి వారిని నేతలు పెంచి పోషిస్తూ అసలైన ఓటర్లను మోసం చేస్తున్నారని కొందరు ఓటర్లు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి రాజకీయ బ్రోకర్లు అధికార పార్టీ అని లేదు, ప్రతి పక్ష పార్టీ అని లేదు అన్ని పార్టీల్లో వీరు నమ్మకంగా ఉంటూ ఓటర్లను అడ్డు పెట్టుకొని వారు పబ్బం గడుపుకుంటున్నారని పలువురు ఓటర్లు మనోవేధన వ్యక్తం చేస్తున్నారు.

**ఓటుకు రూ. 500 చొప్పున ఇరు పార్టీలు పంపిణీ :**

ఖమ్మం పార్లమెంట్ ఎన్నికలు సోమవారం జరుగుతుండటంతో అధికార కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన వారు ఎవరికి వారు తమ అభ్యర్థులను గెలిపించుకోవాలని పోటా పోటీగా పార్టీల నేతలు శని, ఆదివారాలు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నుయ్యారు. కాంగ్రెస్ పార్టీవారు ఓటుకు రూ. 500 చొప్పున పంపకాలు చేయగా, బీఆర్ఎస్ పార్టీవారు తమ అభ్యర్థిని గెలిపించుకోవాలని ఓటుకు రూ. 500 చొప్పున ఓటర్లకు పంపిణీ చేయడం జరిగింది.

ఇలా ఓటుకు నగదు పంపకాలు విచ్చలవిడిగా పంచి ఓటర్లను ప్రలోభపెడుతుంటే నియంత్రించాల్సి న నిఘా నేత్రాలు నిద్రపోతున్నాయని విజ్ఞానవంతులు, మేధావులు నివ్వెరపోతున్నారు. ఓటుకు నోట్లు రెండు పార్టీలు పోటా పోటీగా నియోజకవర్గంలో 2 లక్షల 44 వేల మంది ఓటర్లకు మొత్తం ఒకొక్క పార్టీ దాదాపు రూ. 10 చొప్పున పంపకాలు జరిపినట్లు తెలుస్తుంది.

ఈ పంపకాలు ఒక పార్టీ 80 శాతం మందికి, మరో పార్టీ 60 శాతం మందికి పంపకాలు జరిపినట్లు సమాచారం. ఇన్ని కోట్లరూపాయలు ఓటర్లకు పంపకాల పేరుతో నేతల చేతులు మారాయంటే ఎంత మంది రాజకీయ బ్రోకర్లు ఈ పేరుతో అభివృద్ధి చెందు తున్నారో విజ్ఞులైన ప్రజలు తెలుసుకోవాలని మేథావి వర్గాలు పేర్కొంటున్నాయి.

# ఎన్నికలకు సర్వం సిద్ధం



...సహాయ ఎన్నికల అధికారి సుబ్రమణ్యం

ఫోటో:1,2



**చండూరు,12మే,ప్రభాతవార్త:**
నేడు జరుగనున్న పార్లమెంట్ ఎన్నికలకు గాను సర్వం సిద్ధం చేసినట్లు సహాయ ఎన్నికల అధికారి సుబ్రమణ్యం తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 317 పోలింగ్ కేంద్రాలకు గాను 32 రూట్లలలో పోలీస్ బందోబస్తు నడుమ ఈవిఎంలను పోలింగ్ బూత్‌లకు తరలించారు. 30మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. నియోజకవర్గంలో మొత్తం 257557 మంది ఓటర్లు ఉండగా, ఇందులో మహిళలు 129321, పురుషులు 128233 , ఇతరులు 3 ఉన్నారు. ఇందుకుగాను ఎన్నికల అధికారులు 396 కంట్రోల్ యూనిట్లు, 443 వివిప్యాట్లతో ఈవిఎంలను పోలింగ్ బూత్‌లకు తరలించారు. నియోజకవర్గంలో మొత్తం 317 పోలింగ్ బూతులు 217 ప్రదేశాలలోఉండగా, చండూరు మండలంలో 41 బూతులలో మొత్తం 35099 మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 17498, మహిళలు 17600, ఇతరులు1, మునుగోడులో 44 బూతులకు 37343 ఓటర్లకు గాను పురుషులు 18651, మహిళలు 18692 , మర్రిగూడలో 33 బూతులలో నాంపల్లి మండలంలో 46 బూతులలో 35566గాను పురుషులు 17505 , మహిళలు 18060, ఇతరులు 1, గట్టుప్పలలో 17 బూతులలో 15507 ఓటర్లకుగానే పురుషులు 7801, మహిళలు 70706 , చౌటుప్పల్‌లో 720 బూతులలో మొత్తం 64213ఓటర్లకు గాను మహిళలు 32269, పురుషులు 31963, ఇతరులు 1, సంస్థాన్ నారాయణపురం మండలంలో 54 బూతులలో మొత్తం 39500 ఓటర్లలో 19868 పురుషులు, మహిళలు19672 ఉన్నారు. ఒక్కో పోలింగ్ బూత్‌కు ఒక ప్రిసెడింగ్ అధికారి ,ఒక సహాయ ప్రిసెడింగ్ అధికారి, ఇద్దరు పివోల చొప్పున మొత్తం 317 పోలింగ్ కేంద్రలకు 396 మంది పివోలు, 396మంది ఏపివోలు ,792 మంది ఓపివోలు, ఎన్నికల సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకుగాను ఇద్దరు డిఎస్పీలు, నలుగురు సిఐలు, 20మంది ఎస్ఐలు, సుమారు 600మంది పోలీస్ సిబ్బంది, 200మంది పారామిలటరీ బలగాలతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు సహాయ ఎన్నికల అధికారి పేర్కొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 65 పోలింగ్ కేంద్రాలను (32ప్రదేశాలు) సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి అక్కడ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకుగాను పారామిలటరీ బలగాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

## అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించాలి

**నడిగూడెం, మే12, ప్రభాతవార్త :**
తీవ్ర ఎండల కారణంగా అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు. 5 సంవత్సరాలలోపు చిన్నారులు కేంద్రాలలో చదువుకుంటున్నారు. ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉన్నప్పటికి వేసవి సెలవులు ప్రకటించకపోవడంతో చిన్నారులు కేంద్రాలకు వచ్చేందుకు ఆసక్తి చూప దం లేదు. పౌష్టికాహారాన్ని ఇంటింటికి వెళ్ళి సరఫరా చేయాలని పలు వురు కోరుతున్నారు. ఆయాలకు సెలవులు ప్రకటించారు. టీచర్లకు, చిన్నా రులకు సెలవులు మాత్రం ప్రకటించలేదు. సంబంధిత శాఖ అధికారులకు సెలవులు ఇవ్వాలని వినతిపత్రం అందజేసినప్పటికి నేటికి అమలుకు నోచుకోలేదు. రోహిణికార్తె మరో 10 రోజుల్లో ప్రవేశించనున్నందున ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉండడంతో అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## పోలింగ్ బూతులకు చేరిన ఎన్నికల సామాగ్రి

**మునగాల ప్రభాతవార్త:**



పార్లమెంట్ ఎలక్షన్ నిర్వహణకు పోలింగ్ బూతులు వద్దకు ఎన్నిక సామాగ్రి ఆదివారం చేరుకుంది. ఈ సందర్భంగా సెక్టోరియల్ అధికారి అనిల్ కుమార్ మాట్లాడుతూ.. మండలంలోని పోలింగ్ బూత్‌లో వద్ద ఎన్నికల నిర్వహనకు సర్వం సిద్ధం చేసినట్లు తెలిపారు. ఓటర్లు అసౌకర్యానికి గురి కాకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేసి అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.

## ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి: తహసిల్దార్

**మునగాల ప్రభాతవార్త:**
ఓటు హక్కును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ ఆంజనేయులు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రతి ఒక్కరూ ఓటు వేసి ఓటు హక్కును వినియోగించు కోవాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉన్నట్లయితే ఓటింగ్ శాతాన్ని పెంచవచ్చున్నారు.

## పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు

**నడిగూడెం, మే12, ప్రభాతవార్త :**





మండలంలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ నిర్వ హణకు గాను అధికారులు ఏర్పా ట్లు సిద్ధం చేశారు. మండలంలో 29 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. 24289 మంది ఓటర్లు నమోదు అయ్యారు. నేడు ఓటు హక్కును వినియోగించు కుంటున్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన సౌకర్యాలు కల్పించారు. విద్యుత్, మంచినీరు సౌకర్యాలను అందుబాటులో ఉంచారు. ఎండ వేడిమి కారణంగా ఓటర్లు ఇబ్బందు లు పడకుండా వైద్యసిబ్బందిని కూడా అందుబాటులో ఉంచారు. 29 పోలింగ్ కేంద్రాలకు ఆదివారం సాయంత్రం పోలింగ్ సిబ్బంది చేరు కున్నారు. నేడు పోలింగ్ నిర్వహణకు గాను ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అధికారులు ఎప్పటికప్పుడు పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షిస్తున్నారు. అదనపు పోలింగ్ బలగాలను కూడా మండలానికి రప్పించారు. నేడు ఉదయం 7 గంటలకు పోలింగ్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించారు. నడిగూడెంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆకర్షణీయంగా కేంద్రాన్ని అలంకరించారు. మండలంలో పలు గ్రామాలలో మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

# ఐదేళ్ళ పాలనకు రూ. 500లు, రూ. 400లేనా

**- అసహనం వ్యక్తం చేస్తున్న ఓటర్లు**

*తల్లాడ, మే 12, ప్రభాతవార్త:*
ఇటీవల జరిగిన అసెంబ్లి ఎన్నికలలో ఓ పార్టీ ఓటుకు రూ. 2 వేలు, మరో పార్టీ రూ. 1000 ఓటర్లకు పంపిణీ చేయగా సోమవారం జరిగే పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఓ పార్టీ రూ. 500లు, మరో పార్టీ రూ. 400లు పంపిణీ చేయడంతో ఓటర్లలో అనాశక్తి నెలకొంది. మండల వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొనడంతో ఓటర్లలో గందరగోళం నెలకొంది. ఐదు నెలలకే ఓటర్లలో అంత పలుచన అయ్యారా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్ళ పాలనకు రూ. 500లు ఏమిటని ప్రశ్నిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలు తమకు ఉపయోగం లేకుండా పోయాయని ఓటర్లు మదనపడుతున్నారు. మండల వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొనడంతో అన్ని గ్రామాల్లో కూడా ప్రధాన రాజకీయ పార్టీల నాయకుల వ్యవహార శైలిపై కార్యకర్తలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బూత్ స్థాయిలో రూ. 15 వేలు తీసుకున్న నాయకులు ఓటుకు రూ. 500లు, రూ. 400లు పంపిణీ చేయడమేమిటని ప్రశ్నిస్తుండగా మరో పార్టీ కూడా అక్కడక్కడ రూ. 300లు పంపిణీ చేస్తున్నట్లు తెలిసింది. ఏది ఏమైనా గందరగోళ పరిస్థితులు నెలకొనగా ఈ ప్రభావం ఎటువంటి దారి తీస్తుందో వేచి చూడాల్సి ఉంది.




# ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

## పంపిణీ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్

*అశ్వారావుపేట రూరల్, ప్రభాతవార్త:*
నేడు జరిగే పార్లమెంట్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో మొత్తం 184 పోలింగ్ కేంద్రాల్లో 124 లోకేషన్‌లలో పోలింగ్ ప్రక్రియ జరగనుంది. ఇందుకు గాను అన్ని పోలింగ్ బూత్‌ల వద్ద ఎన్నికల అధికారులు పటిష్ట చర్యలు చేపట్టారు. అశ్వారావుపేట నియోజకవర్గంను సమస్యాత్మక ప్రాంతంగా గుర్తించడంతో ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమై సాయంత్రం 4గంటలకు ముగియనుంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించు కునేందుకు గాను కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లను చేశారు. ఇదిలా ఉండగా ఎన్నికల సిబ్బందికి స్థానిక వ్యవసాయ కళాశాల వద్ద అధికారులు సామగ్రిని బూత్‌ల వారీగా పంపిణీ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ప్రియాంక అలీ ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమాలలో ఎన్నికల సహాయ అధికారి వేణుగోపాల్, తహశీల్దార్ ప్రసాద్, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా 184 పోలింగ్ కేంద్రాలకు గాను మొత్తం 880 మంది ఎన్నికల సిబ్బందిని కేటాయించగా ఇందులో పిఒలు 220, ఎపిఒలు 220, ఓపిఒలు 440 మంది ఉండగా నియోజకవర్గ వ్యాప్తంగా నేడు జరిగే సమరంలో మొత్తం 1,59,174 మంది ఓటుహక్కు వినియోగించుకోనున్నారు.





## కటకటాలు పాలైన వాహన చోరుడు

*క్రైం ఖమ్మం, మే 12, ప్రభాతవార్త:*
ఖమ్మం నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా అనుమానితుల్ని అదుపులోకి తీసుకొని విచారించగా 8 వాహనాలు చోరి చేసినట్లు అంగీకరించిన వ్యక్తిని అరెస్టు చేయడంతో కటకటాలు పాలైయ్యాడు. 1వ పట్టణ సిఐ వద్దె ఉదయ్ కుమార్ కథనం ప్రకారం ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న నిందితుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్‌టిఆర్ జిల్లా పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన రాములును అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ సందర్భంగా 1వ టౌన్ పరిధిలో 4, 2వ టౌన్ పరిధిలో 4 వాహనాలు చోరీ చేసిన అతను వద్ద నుండి స్వాదీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

## సైబర్ నేరగాళ్ల వేధింపులపై ఆందోళన

*క్రైం ఖమ్మం, మే 12, ప్రభాతవార్త:*
ఖమ్మం నగరంలోని ఓ డిగ్రీ కళాశాల్లో డిగ్రీ చదువుతున్న ఓ విద్యార్ధిని సైబర్ నేరగాళ్ల వేదింపులకు గురికావడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన సంఘటన ఇది. బాధితురాలు కధనం ప్రకారం కల్లూరుకు చెందిన యువతిని వాట్సాప్ ఇన్‌స్ట్రాగ్రాం ఖాతాలో హ్యాక్ చేసి వేదింపులకు పాల్పడుతున్న సంఘటన వెలుగు చూసింది. ఈ మేరకు 1930 కాల్ చేసిన స్పందించ లేదని కుటుంబ సభ్యులు వాపోతున్నారు. సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేసిన వేదింపులు తాత్కాలికంగా ఆగిన 10 రోజులుగా ఆమెతో పాటు సోదరి బంధువుల్లో కూడా సందేహాలు వస్తున్నాయి. దీంతో ఆన్‌లైన్ సైబర్ క్రైమ్ విభాగానికి ఈ నెల 7, 9 తేదీల్లో ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో స్థానిక స్టేషన్‌లో కేసు పెట్టాలని సైబర్ క్రైమ్ వెబ్‌సైట్‌లో సరైన విభాగంలో ఫిర్యాదు చేయాలని బాధితురాలికి వివరించడం జరిగింది. ఇలాంటి సంఘటనలపై తమకు న్యాయం చేయాలని యువత కుటుంబ సభ్యులు ప్రాదేయపడుతున్నారు.

# నేరాలు-దారుణాలు

## ఘనంగా సోయం గంగులు వర్ధంతి



*దమ్మపేట, మే 12 ప్రభాతవార్త:*
తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మన్యం బొబ్బిలి సోయం గంగులు వర్ధంతి కార్యక్రమాన్ని మండల కేంద్రం దమ్మపేటలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద గల గంగులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ హక్కుల కోసం, దున్నేవారికి భూమి దక్కాలి అని నినాదిస్తూ జంగు సైరన్ పూరించి జమిందారు వ్యవస్థపై తిరుగుబాటు చేసిన ఘనమైన చరిత్ర గంగులుది అని అన్నారు. సోయం గంగులు ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరూ కంకణ బద్ధులై పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సోయం వీరభద్రం, కోర్స వెంకటేశ్వరావు, రామారావు, రామ్మూర్తి, వెంకటేశ్వర్‌రావు, చంద్రశేఖర్, వాడె వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మొక్కల ఆరోగ్య దినోత్సవ అవగాహన



*రఘునాథపాలెం, మే 12, ప్రభాతవార్త:*
అంతర్జాతీయ మొక్కల ఆరోగ్య దినోత్సవ అవగాహన సదస్సు ఆదివారం దారేదు గ్రామ పంచాయితి ఆవరణలో జరిగింది. రిలయన్స్ ఫౌండేషన్, ఏరిష్ ఆగ్రో సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమానికి మేనేజర్ నల్లపునేని బాబురావు నిర్వాహకులు షేక్ అన్వర్‌పాషలు హాజరై పోషణ విలువల గురించి వివరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా



విచ్చేసిన రిలయన్స్ పౌండేషన్ మేనేజర్ చీపుల్ల వరహాలు మాట్లాడుతూ ఆకలిని నివారించడానికి పేదరికాన్ని తగ్గించడానికి జీవ వైవిద్యాన్ని రక్షించడానికి ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహించడానికి ఎంతో ఉపయోగపడుతుందని రైతులు వివరించారు. రైతుల సందేహాలకు టోల్ ఫ్రీ నెంబర్ 18004198800 వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరిష్ జిల్లా సూపర్‌వైజర్ శ్రీనివాసరెడ్డి, జూనియర్ సూపర్‌వైజర్ రాకేష్, రిలయన్స్ జిల్లా ప్రతినిది చల్లా వెంకటేశ్వర్లు రైతు సంఘం నాయకులు మద్ది వెంకటరెడ్డి ఏనుగు రాంరెడ్డి, బద్దం నగేష్‌రెడ్డి, శౌంరి శ్రీకాంత్, మాధవరావు పాల్గొన్నారు.




# భద్రాచలం ఏజెన్సీలో ఎన్నికలకు సర్వం సిద్ధం

**-ఉద్యోగులకుఎన్నికల సామాగ్రి పంపిణీ**

**-భద్రాచలం నియోజకవర్గంలో 176 పోలింగ్ కేంద్రాలు**

**-ఏజెన్సీలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు**

*భద్రాచలం, ప్రభాతవార్త :*



పార్లమెంట్ ఎన్నికల నిమిత్తం భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గంలో పోలింగ్‌కు సర్వం సిద్ధం చేశారు. ఆదివారం ఎన్నికల విధిలో పాల్గొనే సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పంపిణీ చేశారు. 176 పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది తరలి వెళ్ళారు. ఇందుకోసం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికలకు సంబంధించిన వివరాలను భద్రాచలం ఎస్టీ నియోజకవర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి దామోదర్‌రావు పలు వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. సోమవారం జరిగే ఎంపీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా మారుమూల మండలాల చర్ల, దుమ్ముగూడెం సెక్టార్‌లకు సంబంధించిన పోలింగ్ స్టేషన్‌లకు ప్రత్యేక పోలీసు, సీఆర్పీఎఫ్ బలగాల సెక్యూరిటీతో ముందుగా పంపించడం జరిగిందని అన్నారు. ప్రతి సెక్టార్ రూటుల వారీగా పోలింగ్ స్టేషన్‌లను బట్టి సిబ్బందిని చేరవేయడానికి బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని, 176 పోలింగ్ స్టేషన్‌లకు గాను 25 మంది సెక్టార్ అధికారులు, 120 మంది రిజర్వుగా పోలింగ్ సిబ్బందితో 844 మందిని నియమించడం జరిగిందని అన్నారు. ఎన్నికల విధులకు వెళ్ళే పోలింగ్ స్టేషన్‌లకు ఎండాకాలంను దృష్టిలో పెట్టుకుని గ్లూకోజ్ డిపాకెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను ప్రతి పోలింగ్‌స్టేషన్‌కు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. అలాగే పోలింగ్ స్టేషన్‌లలో కరెంటు, మంచినీటి సౌకర్యం కల్పించడం జరిగిందని, పోలింగ్ స్టేషన్‌లో నియమించబడ్డ సిబ్బందికి ముందుగా పోలింగ్ మెటీరియల్ ఇవ్వడం జరిగిందని, వారు సామాగ్రి సరిచూసుకున్న అనంతరం రాజకీయ ప్రజాప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడం (స్ట్రాంగ్ రూమ్) సీల్ తీసి ఈవీఎం మిషన్‌లను పోలింగ్ సిబ్బందికి ఇవ్వడం జరిగిందని అన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో పోలింగ్ సిబ్బందికి అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని, సంబంధిత పోలింగ్ సిబ్బంది వారి వారి పోలింగ్ స్టేషన్‌కు చేరుకున్న తరువాత 13వ తేదీ నాడు జరిగే ఓటింగ్ ప్రక్రియకు సంబంధించి అన్ని ఏర్పాట్లు ఆదివారం సాయంత్రం వరకుపూర్తి చేశారని, 13వ తేదీ ఉదయం 5.30 గంటలకు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్‌పోల్ నిర్వహించాలని, అనంతరం సెక్టరల్ ఆఫీసర్ల సమక్షంలో ఈవీఎం మిషన్ సీల్ వేసి ఉదయం 7 గంటలకు ఓటింగ్ ప్రక్రియ ప్రారంభించాలని, సాయంత్రం పోలింగ్ అయిపోయే సమయంలో ఓటర్లు గనక ఉంటే ప్రత్యేకంగా తయారు చేసిన స్లిప్పులను అందించి ఓటింగ్ ప్రక్రియ అయిపోగానే సామాన్లన్ని జాగ్రత్తగా తీసుకుని భద్రత నడుమ సెక్టర్ ఆఫీసర్ల సమక్షంలో తిరిగి తీసుకురావాలని అన్నారు. పోలింగ్ సిబ్బందికి ఏ చిన్న సమస్య వచ్చినా సొంతంగా నిర్ణయం తీసుకోవద్దని, ఏ సమస్య ఉన్నా సంబంధిత సెక్టరల్ అధికారికి, ఏఆర్‌వోకు తెలియజేయాలని అన్నారు. పోలింగ్ ఏజెంట్ల ద్వారా టెండర్ ఓటు, ఛాలెంజ్ ఓటు గురించి సమస్య వస్తే వెంటనే పై అధికారుల దృష్టికి తీసుకువచ్చి సమస్య పరిష్కరించుకోవాలని అన్నారు. భద్రాచలం నియోజకవర్గంలో పోలింగ్ స్టేషన్‌లలో సిగ్నలింగ్ వ్యవస్థ సరిగా లేని దగ్గర ప్రత్యేక యాప్ ద్వారా, ప్రతి రెండు గంటలకు ఒకసారి అన్ని పోలింగ్ స్టేషన్‌ల నుంచి సంబంధిత సెక్టరల్ అధికారులు పురుషులు, స్త్రీలు వేరువేరుగా పోలింగ్ సరళిని తప్పనిసరిగా ఏఆర్‌వోకుతెలియజేయాలని అన్నారు. సెక్టరల్ అధికారుల నుంచి మొదలుకుని పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు, పోలింగ్ స్టేషన్‌లో వివిధ పనులకు నియమించిన సిబ్బంది అందరూ కలిసికట్టుగా ఉండి పోలింగ్ ప్రక్రియ ప్రశాంతమైన వాతావరణంలో జరిగే సహకరించాలని అన్నారు. తహసిల్దార్ శ్రీనివాస్, నయాబ్ తహసిల్దార్ ఎలక్షన్ మహీధర్, రెవెన్యూ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

*భద్రాచలంటౌన్, ప్రభాతవార్త :*

భద్రాచలం పట్టణంలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు గాను అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. పట్టణంలో 41 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 40,152 మంది ఓటర్లు ఉండగా అందులో మహిళలు 20,780 మంది, పురుషులు 19,370 మంది, ఇతరులు ఇద్దరు ఉన్నారు. కాగా నేడు వీరంతా ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు తగిన సౌకర్యాలు కల్పించారు. విద్యుత్, మంచినీరు సౌకర్యాలను అందుబాటులోకి తీసుకుని వచ్చారు. ఎండ వేడిమి కారణంగా ఓటర్లు ఇబ్బందులు పడకుండా వైద్యసిబ్బందిని కూడా అందుబాటులో ఉంచారు. 41 పోలింగ్ కేంద్రాలకు ఆదివారం సాయంత్రం పోలింగ్ సిబ్బంది చేరుకున్నారు. నేడు పోలింగ్ నిర్వహణకు గాను ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అధికారులు ఎప్పటికప్పుడు పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షిస్తున్నారు. అదనపు పోలింగ్ బలగాలను కూడా పట్టణానికి రప్పించారు. నేడు ఉదయం 7 గంటలకు పోలింగ్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించారు. పట్టణంలో 4 మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ మోడల్ పోలింగ్ కేంద్రాలను ఆకర్షణీయంగా అలంకరించారు. పోలీసు యంత్రాంగం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. 144 సెక్షన్ సెక్షన్‌ను అమలులో ఉంచారు.

## అదుపు తప్పిన పల్లె వెలుగు బస్సు

*బూర్గంపహాడ్, ప్రభాతవార్త :*



ప్రమాదవశాత్తు ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు అదుపు తప్పి కాలువలోకి దూసుకు వెళ్ళిన సంఘటన ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాక గ్రామశివారులో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించిన స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి .. మణుగూరు నుంచి భద్రాచలం వెళ్తున్న మణుగూరు డిపోకు చెందిన టీఎస్28ఏ2219 అనే నెంబర్ గల ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు బూర్గంపహాడ్ మండల పరిధిలోని మోతె గ్రామం దాటిన తరువాత ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయిన సందర్భంగా బ్రేక్ ఫెయిల్ అయ్యి అదుపు తప్పడంతో ప్రధాన రహదారి పక్కనే ఉన్న కాలువలోకి దూసుకు వెళ్ళింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో సుమారు 40 మంది ప్రయాణికులు ఉన్నట్లు స్థానికులు తెలుపుతున్నారు ప్రయాణికులలో 20 మందికి స్వల్ప గాయాలు కాగా సుమారు 10 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. స్థానికులు స్పందించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో ప్రస్తుతానికి ఎటువంటి ప్రాణహాని జరగకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొంటున్నారు. సమాచారం అందుకున్న బూర్గంపహాడ్ పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరిస్తున్నారు. కాగా క్షతగాత్రులను డిపో మేనేజర్ రామారావు పరామర్శించారు. ఈ బస్సు ప్రమాదంపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలియజేశారు.



## ఘనంగా ఆదిశంకర, శ్రీరామానుజ జయంతి వేడుకలు

*భద్రాచలంకల్చరల్, ప్రభాతవార్త :*



శ్రీక్రోధి నామ సంవత్సర వైశాఖ శుద్ధ పంచమిని పురస్కరించుకుని ఆదివారం రంగనాయకులగుట్టపై గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం, భద్రాద్రి బ్రాహ్మణ పురోహిత సంఘం ఆధ్వర్యంలో జగద్గురు ఆదిశంకరాచార్య, శ్రీరామానుజ జయంతి వైభవోపేతంగా నిర్వహించారు. ముందుగా స్వామి వారి చిత్రపటం వద్ద జ్యోతిప్రజ్వలన గావించి చిత్రపటానికి పూలమాలలు సమర్పించారు. ఈ సందర్భంగా గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామావజ్జల రవికుమార్‌శర్మ మాట్లాడుతూ .. జగద్గురు శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్య స్వామి వారు భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు ప్రజలందరికి తెలియజేసే నిమిత్తం భారత ఖండంలో ముమ్మారు పాదయాత్ర నిర్వహించారని, భారతీయుల ఔన్నత్యాన్ని తెలియజేస్తూ దీనికి తగ్గట్టుగా ప్రజలంతా భారతీయ సనాతన సాంప్రదాయాలను అనుసరించాలని తెలియజేశారని అన్నారు. ప్రయాణ సౌకర్యాలు ఏ మాత్రం లేని పరిస్థితులలో నిర్వహించిన ఈ యాత్రలో ఆదిశంకరాచార్య స్వామి వారు భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దివ్యదర్శనం చేసుకుని వామాంక స్థిత జానకి పరిల సత్ కోదండ దండకరే అంటూ స్వామి వారిని ప్రార్థించారని, అనంతరం భక్త రామదాసు రామాలయం నిర్మించారని, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన భద్రాద్రి సీతారాములను దర్శించుకున్న భక్తులకు పునర్జన్మ ఉండదని, రామానుగ్రహంతో మోక్ష ప్రాప్తి పొందుతారని భక్తుల విశ్వాసమని అన్నారు. భద్రాద్రికి వచ్చి శ్రీసీతారాముల దర్శనం చేసుకున్న జగద్గురు ఆదిశంకరాచార్య విగ్రహాన్ని భద్రాచలం దివ్యక్షేత్రంలో నెలకొల్పాలని భక్తులు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికు విజ్ఞప్తి చేశారు. ఆదిశంకరాచార్య, రామానుజాచార్య జయంతి సందర్భంగా స్వామి వార్లకు అష్టోత్తర శతనామార్చనతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి వడపప్పు, పానకం, మామిడి పండ్లు, విసిరి కర్రలు పంపిణీ చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గాయత్రి బ్రాహ్మణ సంఘం ప్రముఖులు రామావజ్జల రవికుమార్‌శర్మ, బుక్కపట్నం రామాచార్యులు, సౌమిత్రి శేషాచార్యులు, కలకోట రఘురామాచార్యులు, కంజర్ల జగన్, కే.నంబులాద్రి, రాజు, ఉమాదేవి, లక్ష్మీ, మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని రకాల భద్రతాపరమైన చర్యలు

**-ఏఎస్పి పరితోష్ పంకజ్**

*భద్రాచలం ప్రభాతవార్త :*



నేడు జరగబోయే పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు సంబంధించి భద్రాచలం డివిజన్‌లో గల 117 పోలింగ్ కేంద్రాలలో భద్రతాపరమైన అన్ని రకాల చర్యలను ఏర్పాటు చేసినట్లు భద్రాచలం ఏఎస్పి పరితోష్ పంకజ్ వెల్లడించారు. భద్రాచలం డివిజన్ ప్రజలంతా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం జరిగిందని, భద్రాచలంలో డివిజన్లక 1300 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సోమవారం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరగబోయే ఓటింగ్‌లో ప్రజలంతా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల దూరంలో ఎలాంటి ప్రచార బోర్డులు, లౌడ్ స్పీకర్‌లు ఏర్పాటు చేయకూడదు, పోలింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు, మంటను ప్రేరేపించే వస్తువులకు అనుమతి లేదు ప్రజలంతా ఇట్టి విషయాన్ని గమనించగలరు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం పోలీసులు చేపట్టే చర్యలు అతిక్రమిస్తే అట్టి వారిని ఉపేక్షించేది లేదు. పోలింగ్ కేంద్రాలలో గానీ, పరిసర ప్రాంతాల్లో గానీ ఓటర్లను ప్రలోభ పెట్టే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగింది. ఓటర్లను ప్రలోభ పెట్టే విధంగా ఎవరైనా నగదు, మద్యం, ఇతరత్రా వస్తువులను ఎవరైనా పంపిణీ చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100కి ఫోన్ చేసి గానీ, సి-విజిల్ యాప్ ద్వారా గానీ ఫిర్యాదు చేసి సమాచారం అందజేయాలని కోరారు. భద్రాచలం డివిజన్ వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉన్నదని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించే వ్యక్తులపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కావున ప్రజాస్వామ్య బద్ధంగా జరిగే పోలింగ్ ప్రక్రియకు ప్రతి ఒక్కరూ పోలీసు వారికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## ద్విచక్రవాహనాన్ని తగలబెట్టిన దుండగులు



బూర్గంపహాడ్, ప్రభాతవార్త :
బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని గౌతమిపురం పాండవుల కాలనీలోని నివాసం ఉంటున్న దేగల వెంకటేశ్వర్లు ఇంటి ఎదుట నిలిపి ఉన్న ప్యాషన్ ప్రో ద్విచక్రవాహాన్ని గుర్తు తెలియని దుండగులు శనివారం అర్ధరాత్రి సమయంలో తగలపెట్టారు. ఉదయమే ద్విచక్రవాహనదారుడు ఉదయం లేచి చూడగానే వాహనం అగ్నికి ఆహుతి అయ్యి ఉంది. దీంతో స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

## పార్లమెంట్ ఎన్నికలకు సర్వం సిద్ధం



బూర్గంపహాడ్, ప్రభాతవార్త :
బూర్గంపహాడ్ మండలంలో పార్లమెంట్ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపధ్యంలో ఆరు సెక్టార్లకు గాను 57 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. మండలంలోని ఆయా గ్రామపంచాయతీలో ప్రభుత్వ పాఠశాలలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా పురుషులు, స్త్రీలు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభం అవుతుందని ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని సౌకర్యాలు పోలింగ్ బూతుల వద్ద ఏర్పాటు చేయడం జరిగిందని అధికారులు తెలిపారు. మండల వ్యాప్తంగా మొత్తం ఓటర్లు 49,813 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా గ్రామాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు, ప్రశాంతమైన వాతావరణంలో ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకునేందుకు సహకరించాలని కోరారు.

## నవజాత శిశువులకు దుస్తులు పంపిణీ



భద్రాచలంటౌన్, ప్రభాతవార్త :
అంతర్జాతీయ నర్సుల దినోత్సవం, మదర్స్‌డే సందర్భంగా మదర్‌థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో నవజాత శిశువులకు పిల్లల వైద్య నిపుణులు డా.వై.రాజశేఖర్‌రెడ్డి, సీనియర్ నర్సు దుర్గభవాని చేతులమీదుగా ఒక్కొక్క శిశువుకు రెండు జతల చొప్పున 30 మందికి దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిల్లల వైద్య నిపుణుడు ఆర్ఎంవో డా.వై.రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ .. నవజాత శిశువులకు దుస్తులు పంపిణీ చేసినందుకు ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు. అనంతరం ట్రస్ట్ వ్యవస్థాపకుడు కొప్పుల మురళి మాట్లాడుతూ .. నాలుగు రాష్ట్రాల సరిహద్దులకు కేంద్ర బిందువైన భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని నర్సులు నిజంగా సేవా మూర్తులేనని, రోగి ఆసుపత్రికి వచ్చిన దగ్గర నుంచి కోలుకుని ఇంటికి వెళ్ళే వరకు వెన్నంటే ఉండి సేవలు చేస్తారని పేర్కొన్నారు. కరోనా సమయంలో వైద్యులతో పాటు నర్సులు చేసిన సేవలను వెలకట్టలేనివని కొనియాడారు. వైద్యులు ఇచ్చే మందులు, చికిత్సతో పాటు రోగి ఒక వ్యాధి నుంచి కోలుకోవడానికి సరైన సంరక్షణ ఎంతగానో దోహదం చేస్తుందని తెలిపారు. ఇందులో 24 గంటలు రోగి సంరక్షణలో నిమగ్నమైన వైద్యుల కంటే నర్సులదే బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు కొప్పుల మురళి, ట్రస్ట్ సభ్యుడు చోళ్ళ ఇన్సూరెన్స్ మేనేజర్ బాలరాజు, బూరం నవీన్, సాయికుమార్, జయరాం, హాస్పిటల్ నర్సు కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



మధిరరూరల్, మే 12, ప్రభాతవార్త:
మధిర స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మధిర సివిల్ ఆసుపత్రిలో పనిచేస్తున్న నర్సులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు జంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ కాలిన గాయాలతో ఆసుపత్రికి వచ్చే బాధితులైనా, రోడ్డు ప్రమాద క్షతగాత్రులైనా, పురిటినొప్పులతో వచ్చే గర్భిణీలు అయినా తోబుట్టువుల్లా మొదట పలకరించేది నర్సులేనన్నారు. అనంతరం మదర్స్‌డే వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్విమ్మర్స్ అసోసియేషన్ సభ్యులు ఊటుకూరు భాస్కర్‌రావు, పద్మజా, ఆదూరి అబ్రహం, రంగిశెట్టి శ్రీనివాసరావు, జింకల కోటేశ్వరరావు, గందూరి రాంబాబు, మైనీడి పూర్ణచంద్రరావు, భూక్యా హనుమా, యలమద్ది రాము, బజాజ్ సాంబిరెడ్డి, శీలం శ్రీనివాసరెడ్డి, సుకూర్, మేకల ఉపేంద్ర, చీదిరాల సత్యనారాయణ, అబ్దుల్ హనీఫ్, రెహ్మాన్, కూరపాటి శ్రీను, దాచేపల్లి రాము, పల్లపోతుల ప్రసాదరావు పాల్గొన్నారు.

## విద్యార్థులు ప్రత్యేకమైన లక్ష్యంతో చదువుకోవాలి

మధిరరూరల్, మే 12, ప్రభాతవార్త:



విద్యార్థులు ప్రత్యేకమైన లక్ష్యంతో చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని మధిర సేవసమితి అధ్యక్షుడు వల్లపోతు ప్రసాదరావు అన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో మూడోర్యాంకు సాధించిన మామిళ్ళపల్లి వర్ష, పాగి శశాంక్‌ను ఆదివారం మధిర సేవసమితి కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు వెళ్ళి మధిరకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మధిర సేవసమితి సభ్యులు మిరియాల కాశీవిశ్వేశ్వరరావు, ముప్పా రామకృష్ణ, కపిలవాయి జగన్మోహన్‌రావు, యర్రా లక్ష్మణ్‌రావు, వందనపు శ్రీనివాసరావు, కోమటి సుధాకర్‌రావు, దొడ్డా శ్రీనివాసరావు, వంగవేటి రాజశేఖర్, షేక్.సైదా, కొత్తమాసు రామారావు, దాచేపల్లి రాము, దొడ్డా వెంకటనారాయణ, నకిరికంటి గోవిందు, కాజా శ్రీనివాసరావు పాల్గొన్నారు.




మధిర, బోనకల్, చింతకాని, ఎర్రుపాలెం, ముదిగొండ

## ఘనంగా శంకర జయంతి ఉత్సవం



మధిరరూరల్, మే 12, ప్రభాతవార్త:
మధిరలోని బ్రాహ్మణబజార్ శ్రీమాతా ధర్మరక్షణ శ్రీ పీఠంలోని వేదమూర్తులు బ్రహ్మశ్రీ ఇంగువ భవాని శంకర్‌శర్మ ఆధ్వర్యంలో ఆదివారం శంకర జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ పీఠ వ్యవస్థాపకులు గాయత్రి ఉపాసకులు జ్యోతిష్య పండితులైన భట్లపెనుమర్రి రాజేశ్వరశర్మ మాట్లాడుతూ సనాతన ధర్మం అంతరిస్తున్న తరుణంలో స్వయంగా ఆ భగవంతుడే శంకరాచార్య రూపంలో కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు దేశవ్యాప్తంగా నాలుగుసార్లు నడియాడి ధర్మాన్ని పునఃప్రతిష్ఠించి పండితుల నుంచి పామరుల వరకు చదువుకునే స్తోత్రాలు, అష్టోత్తరాలు, ఉపనిషత్తులు మరెన్నో అందించి నలుదిశలా పీఠాలను స్థాపించిన అపర శంకరులే ఈ శంకరాచార్యులు అని పేర్కొన్నారు. అందుకే వీరిని జగద్గురు ఆది శంకరాచార్య అని పిలుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరశర్మ, లక్ష్మీతులసీ, సత్య జగన్నాథ్, పవన్‌శర్మ, నోరి గోపాలకృష్ణ, రవి, ఇంగు హన్మత్ శాస్త్రీ పాల్గొన్నారు.

## పెట్రోల్‌బంకులో చోరీ

మధిరరూరల్, మే 12, ప్రభాతవార్త:



మధిర మండల పరిధిలోని సిరిపురం గ్రామంలోగల హెచ్‌పీ పెట్రోల్ బంకులో శనివారం అర్ధరాత్రి 1.20గంటల సమయంలో చోరీ జరిగినట్లు బంకు యజమాని తెలిపారు. దొంగతనానికి వచ్చిన వ్యక్తికి బంకులో ఏమీ దొరక్కపోవడంతో రూమ్‌లో ఛార్జింగ్ పెట్టి ఉన్న సెల్‌ఫోన్‌ను దొంగిలించినట్లు బంకు యజమాని తెలిపారు. బంకు యజమాని శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు మధిర రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## యువ ఓటర్ల పోలింగ్ కేంద్రం ఏర్పాటు



మధిరరూరల్, మే 12, ప్రభాతవార్త:
మధిరలో సోమవారం జరుగనున్న పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తిచేశారు. స్థానిక సుందరయ్యనగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో యువ ఓటర్ల కోసం మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. అలాగే మధిర బాలికోన్నత పాఠశాలలో మహిళా ఆదర్శ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు.

# పార్లమెంట్ ఎన్నికలకు సర్వం సిద్ధం - ఉదయం 7 నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్



*చంద్రుగొండ, మే 12 - ప్రభాతవార్త:*

మండలంలోని చంద్రుగొండలో పార్లమెంట్ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు మండల అధికారులు తెలిపారు. ఆదివారం సాయంత్రం జిల్లా కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు ఈవీఎం బాకుససలతో సిబ్బంది చేరుకున్నారు. సోమవారం జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపద్యంలో పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు, తాగునీటి వసతిని కలినపంచారు. వయోవృద్ధుల కోసం వీల్ చైర్లు, మరుగుదొడ్లు, టెంట్లు ఏర్పాటు చేశారు. అదే విధంగా పోలింగ్ కేంద్రాల వద్ద వైద్య ఆరోగ్య



సిబ్బందిని కూడా ఏర్పాటు చేయడం జరిగింది. ఎన్నికలు ఉదయం నుంచి సాయంత్రం వరకు జరుగుతాయి. ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొన ఓటర్లు ఉదయం, సాయంత్రం పోలింగ్ కేంద్రాలకు చేరుకొని ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. మండలంలో 27 పోలింగ్ కేంద్రాలు ఉండగా 23,565 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషులు 11,532 మంది, మహిళలు 12,032 మంది ఉన్నారు. పోలింగ్ కేంద్రాల వదనద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ సిబ్బంది భారీ బందోబసునత నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికల ప్రక్రియను మండల తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో అశోక్, ఎస్సై మాచినేని రవిలు పర్యవేక్షిస్తున్నారు.

## మండల వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు

**- అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు**

**- వందమంది పోలీసులతో భారీ బందోబస్తు : ఎస్సై రవి**

*చంద్రుగొండ, మే 12 - ప్రభాతవార్త:*



పార్లమెంట్ ఎన్నికల నేపద్యంలో చంద్రుగొండ మండల వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్సై మాచినేని రవి తెలిపారు. మండల వ్యాప్తంగా జరుగుతున్న పోలింగ్ కేంద్రాల వద్ద ఒక సీఐ, ముగ్గురు ఎస్సైలు, పారా మిలటరీ బలగాలు, వందమందికి పైగా పోలీసులతో భారీ బందోబస్తు నిర్వహించనున్నట్లు చెప్పారు. ముఖ్యంగా ఎండలు తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలందరూ ఉదయమే పోలింగ్ కేంద్రాలకు చేరుకొని ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోలింగ్ ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే ఉంటుందని, ప్రజలు సకాలంలో హాజరై ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఎలాంటి వ్యాపార సముదాయాలు నిర్వహించరాదని, వాహన పార్కింగ్ కూడా వేయరాదన్నారు. గతంలో పాత కేసులు ఉన్న వారిని 300 మందిని గుర్తించి బైండోవర్ కేసులు నమోదు చేశామని, ఎన్నికల వేళ గ్రామాల్లో అల్లర్లకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారందరూ నిర్భయంగా పోలింగ్ కేంద్రాలకు చేరుకొని తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# పెద్దమ్మతల్లిని అధికసంఖ్యలో దర్శించుకున్న భక్తులు

*పాల్వంచ, మే 12 - ప్రభాతవార్త:*





పాల్వంచ మండలంలోని కేశవాపురం - జగన్నాథపురం గ్రామంలో వెలిసిన పెద్దమ్మతల్లి అమ్మవారిని ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం అంతా భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి పరిసర గ్రామాలనుంచే కాకుండా జిల్లా నలుమూలలు, ఇతర జిల్లాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. తమను చల్లంగా చూడాలని అంటూ వేడుకుంటూ బోనాలు సమర్పించారు. అన్నప్రాసనలు, వాహన పూజలు, తలనీలాలు, అమ్మవారికి ఒడి బియ్యం, చీరెలు, కనుములు తదితర మొక్కులను చెల్లించుకొని అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు అవసరమైన ప్రత్యేక దర్శనమునకు క్యూలైన్లు, ఉచిత పులిహోర ప్రసాద వితరణ, మంచినీటి వసతి తదితర ఏర్పాట్లను ఆలయ ఈవో సుదర్శన్ ఆదేశాల మేరకు భక్తులకు అవసరం తదితర ఏర్పాట్లు సిబ్బంది పర్యవేక్షించారు.

## పెద్దమ్మతల్లిని దర్శించుకున్న హెల్త్ డిపార్ట్‌మెంట్ జాయింట్ సెక్రటరీ వినయ్‌కృష్ణారెడ్డి




*పాల్వంచ అర్బన్, మే 12 - ప్రభాతవార్త:*

కనకదుర్గ దేవస్థానం శ్రీశ్రీశ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారిని ఆదివారం ఉదయం హెల్త్ డిపార్ట్‌మెంట్ హైదరాబాద్ జాయింట్ సెక్రటరీ వినయ్‌కృష్ణారెడ్డి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వీరికి పూజల అనంతరం వేద పండితులు, అర్చకులు ఆశీర్వచనంతో పాటు అమ్మవారి శేషవస్త్రం ప్రసాదంగా అందించారు.

## ఆలయ పున:ర్నిర్మాణానికి విరాళం

*పాల్వంచ రూరల్, మే 12 - ప్రభాతవార్త:*

పాల్వంచ మండలంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో త్వరలో చేవట్టబోయే పునర్నిర్మాణాలకు భద్రాచలం వెంకటేశ్వరకాలనీకి చెందిన అమ్మవారి



భక్తులు సుధా రాణి, మాధురి దంపతులు రూ.5116 నగదును విరాళంగా అందజేశారు. పూజల అనంతరం అర్చకులు ఆశీర్వచనంతో పాటు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాన్ని అందజేశారు. ప్రత్యేక గోత్రనామార్చన పూజలు చేశారు.

## మా తెలుగు లెక్చరర్‌కు న్యాయం చేయండి సారూ...

*కొత్తగూడెం ఎడ్యుకేషన్, మే 12 - ప్రభాతవార్త:*

మాకు విద్యాబుద్ధులు నేర్పించిన తెలుగు లెక్చరర్ ఇప్పుడు ఇబ్బందుల్లో ఉన్నారు... ఆమెకు న్యాయం చేయండి సార్ అంటూ పూర్వ విద్యార్థి, తెలంగాణ ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ, విద్యార్థి, యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటా శివశంకర్ కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రి రాందాస్ అత్తవాలేను కలిసి ఫిర్యాదు చేశారు. ఎందరో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి వారిని ఉన్నత శిఖరాలు అదిరోహించేందుకు దోహదపడిన లెక్చరర్ రూత్‌మేరీ స్థలాలను కబ్జా చేసిన కాసాని



శ్రీనివాసరెడ్డిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. లెక్చరర్ తాను పైసా పైసా కూడ బెట్టుకున్న డబ్బులతో తీసుకున్న స్థలాన్ని 400 గజాల స్థళంలో పది రోజులలో పెద్ద షెడ్డు నిర్మాణం చేఢాని, దాన్ని కూల్చివేసి మా మేడంకు అప్పజెప్పాలని మంత్రిని కోరారు.




**చుంచుపల్లి, జూలూరుపాడు, సుజాతనగర్**

## ఘనంగా శంకరాచార్యుల జయంతి మహోత్సవం



*కొత్తగూడెం మున్సిపాలిటీ, మే 12 - ప్రభాతవార్త:*

ప్రభుత్వ ఆమోదం పొందిన కొత్తగూడెం రామాటాకీస్ రోడ్‌లోని శంకరాచార్య శ్రీ విద్యాపీఠం (శంకరమఠం)లో శంకరాచార్యుల జయంతి మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. శ్రీవిద్యోపాసకులు, విద్వాంసులు డాక్టరేట్ గ్రహీత కొచ్చర్ల సురేష్‌కుమార్ గురువు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందరికీ ఆశీర్వచనాలు చేశారు. ఈ పూజల్లో కొత్తగూడెంలోని ప్రముఖ వైద్యులు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, వ్యాపారవేత్తలు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా మథర్స్ డే, సిస్టర్స్ డే



*కొత్తగూడెం మున్సిపాలిటీ, మే 12 - ప్రభాతవార్త:*

సీపీఐ, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ, కేఆర్‌కే మదర్ దీవెన ట్రస్టు, మహిళా సమాఖ్యల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మథర్స్ డే, సిస్టర్స్ (నర్సులు)డేను ఘనంగా నిర్వహించారు. కుటుంబానికి తల్లి ఎంత



అవసరమో, వైద్యశాఖలో నర్సుల ప్రాముఖ్యత కూడా అంతే ఉంటుందని వక్తలు అన్నారు. వారి సేవలను కొనియాడారు. మాతృమూర్తులను సన్మానించారు. అదే విధంగా కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎంలను సన్మానించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాకాల లక్ష్మీ, కరీస రత్నకుమారి, మేదిని లక్ష్మీ, భాగ్యలక్ష్మీ, విజయలక్ష్మీ, సరోజ, రమ్య, షమీమ్, శాంతి, నాగమణి, ప్రమీల, సుష్మ, రేణిగుంట లక్ష్మీ, విజయ, అనీత తదితరులు పాల్గొన్నారు.

# మీరు ఓటింగ్‌కు వెళ్లుతున్నారా ?ఇది కాస్త చదవండి...!!







## ఈ సారి మూడు బ్యాలెట్ యూనిట్ బాక్సులు

## 35 మంది అభ్యర్థులు అదనంగా నోట

ఖమ్మం ప్రభాతవార్త:

ఖమ్మం పార్లమెంట్ ఎన్నికలు నేటి ఉదయం 7.00గంటల నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు కొనసాగనుంది. ఓటింగ్‌కు వెళ్లే ఓటర్లు ఎటువంటి ఆందోళనకు గురికాకుండా జాగ్రత్తగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. గతంలో జరిగిన సాధారణ ఎన్నికలు అభ్యర్థుల సంఖ్య తక్కువగా ఉండటం వల్ల ఎవరికి ఓటు వేయాలో క్షణంలో గుర్తించి వారికి మెచ్చిన అభ్యర్థికి ఓటు వేసులుబాటు ఉంటుంది. ఈ సారి అభ్యర్థుల లిస్ట్ చాన్‌తాడంతా పెరిగింది. పోలింగ్ బూత్ వెళ్లగానే ఆందోళన టెన్షన్ గురికాకుండా ప్రశాంతంగా కంగారు లేకుండా తమ ఓటు హక్కు సునాయసాంగా వేసుకొనేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేశాయి.

– 35మంది అభ్యర్థులు అదనంగా నోటా బటన్ –

ఈ సారి బ్యాలెట్ బాక్సుల్లో 35మంది అభ్యర్థుల లిస్టు ఉంటుంది. ఒక్కొక్క బాక్సుల్లో 16మంది అభ్యర్థులకు సంబంధించిన ఫోటోలు వాటికి కేటాయించిన గుర్తులు మాత్రమే కనిపిస్తాయి. మరో బాక్సులో కూడా మరో 16 మంది అభ్యర్థులకు సంబంధించిన పేర్లు వారి ఫోటోలు వారికి కేటాయించిన గుర్తులు కనిపిస్తాయి. మరోక బాక్సులో మిగిలిన ముగ్గురు అభ్యర్థులతో పాటు నోటా బటన్ కూడా కనిపిస్తుంది. ఈ సారి పోలింగ్ బూత్‌లో 3 బ్యాలెట్ యూనిట్ బాక్సులు కనిపిస్తాయి. వీటిల్లో మీకు నచ్చిన అభ్యర్థి ఏ బాక్సులో ఉన్నారో గుర్తించి వారి పేరు ఎదురుగా ఎంపిక చేయబడిన గుర్తుపై ఓటు వేసిన ఆరు సెకన్లలో పక్కనే ఉన్న వివిప్యాట్‌లో మీరు వేసిన గుర్తు ప్రత్యక్షంగా కనిపిస్తోంది.దాదాపు 6 సెకన్లపాటు ఆ గుర్తు మీకు కనిపిస్తోంది. ఒక్కొక్క బాక్సులో 16 మంది అభ్యర్థులు చొప్పున మూడు బ్యాలెట్ యూనిట్ బాక్సులను పోలింగ్ బూత్‌లో సిద్ధంగా ఉంటాయి. బిఎల్‌వో మీకు రెడీ అన్నప్పుడు మీరు ఎంచుకున్న అభ్యర్థి ఏ బాక్సులో ఉన్నారో గుర్తించి ఆ అభ్యర్థికి ఓటు వేయాల్సి ఉంటుంది. మీరు కేటాయించిన సమయంలో ఓటు హక్కును వినియోగించుకోవడం అతి ముఖ్యమైన అంశంగా గుర్తించుకోవాలి.

పోటీలో ఉన్న అభ్యర్థులు వరుసగా బ్యాలెట్‌బాక్సులో పొందుపర్చిన విధంగా ఇలా ఉన్నాయి

### బాక్స్ 1లో ఉన్న అభ్యర్థులు వీరే

| అభ్యర్థి పేరు | పార్టీ |
|---|---|
| 1 నామ నాగేశ్వరరావు | భారత రాష్ట్ర సమితి |
| 2 అడ్వకేట్ యెర్రా కామేష్ | బహుజన్ సమాజ్ పార్టీ |
| 3 రామసహాయం రఘురాంరెడ్డి | ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ |
| 4 తాండ్ర వినోద్‌రావు | భారతీయ జనతా పార్టీ |
| 5 అన్వర్ రయిస్ | సోషలిస్ట్ పార్టీ (ఇండియా) |
| 6 ఆనంద ప్రసాద్ కాశిన | పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా |
| 7 ఆంథోని సురేష్ | బహుజన లెఫ్ట్ పార్టీ |
| 8 కుక్కల నాగయ్య | అలియన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రాఫార్ట్స్ పార్టీ |
| 9 కొప్పుల శ్రీనివాసరావు | జైభీమ్‌రావు భారత్ పార్టీ |
| 10 పాపెట్ల రాంమూర్తి | సకల జనుల పార్టీ |
| 11 భట్టు శ్రీనివాస్ | జై భారత్ నేషనల్‌ప పార్టీ |
| 12. అనిల్‌కమార్ మద్దినేని | స్వతంత్ర అభ్యర్థి |
| 13 అవుటపల్లి రాంబాబు | స్వతంత్ర అభ్యర్థి |
| 14 వెల్లంగల యాదగిరి | స్వతంత్ర అభ్యర్థి |
| 15. ఎదురుగట్ల చిట్టిమల్లు | స్వతంత్ర అభ్యర్థి |
| 16 కటుకోజ్జుల నాగేశ్వరరావు | స్వతంత్ర అభ్యర్థి |

### బాక్సు 2లో ఉన్న అభ్యర్థులు వీరే

| | |
|---|---|
| 17 కాసిమల్ల నాగేశ్వరరావు | స్వతంత్ర అభ్యర్థి |
| 18 గంగిరెడ్డి కోటిరెడ్డి | స్వతంత్ర అభ్యర్థి |
| 19 చిలకబత్తిని స్టాలిన్ | స్వతంత్ర అభ్యర్థి |
| 20 తేజావత్ జోగ్రాం నాయక్ | స్వతంత్ర అభ్యర్థి |
| 21 తంబళ్ళ రవి | స్వతంత్ర అభ్యర్థి |
| 22 నాగేశ్వరరావు లకావత్ | స్వతంత్ర అభ్యర్థి |
| 23 బండారు నాగరాజు | స్వతంత్ర అభ్యర్థి |
| 24 మద్దిశెట్టి ఎర్రప్ప (అజయ్) | స్వతంత్ర అభ్యర్థి |
| 25 మల్లెంపాటి సూర్యనారాయణ | స్వతంత్ర అభ్యర్థి |
| 26 ముత్యం అర్జున రాజు | స్వతంత్ర అభ్యర్థి |
| 27 ఎమ్ రవిచందర్ చౌహాన్ | స్వతంత్ర అభ్యర్థి |
| 28 లింగయ్య దండా | స్వతంత్ర అభ్యర్థి |
| 29 లింగాల రవికుమార్ | స్వతంత్ర అభ్యర్థి |
| 30 వాసం రామకృష్ణ దొర | స్వతంత్ర అభ్యర్థి |
| 31 షేక్ అజ్జులు | స్వతంత్ర అభ్యర్థి |
| 32 షేక్ ఖలీల్ పాషా | స్వతంత్ర అభ్యర్థి |

### బాక్సు 3లో ఉన్న అభ్యర్థులు వీరే

| | |
|---|---|
| 33 షేక్ బాజీబాబా | స్వతంత్ర అభ్యర్థి |
| 34 షేక్ మహ్మద్ రసూల్ | స్వతంత్ర అభ్యర్థి |
| 35 షేక్ షిరాజుద్దీన్ | స్వతంత్ర అభ్యర్థి |
| 36 నోట | నోట |




పాల్వంచ, ములకలపల్లి, లక్ష్మిదేవిపల్లి, చంద్రుగొండ

## వైభవంగా శ్రీఆత్మారాముని కళ్యాణం





దుమ్ముగూడెం, ప్రభాతవార్త :

దుమ్ముగూడెం గ్రామంలో ఎంతో ప్రసిద్ధి గాంచిన శ్రీఆత్మారామ చంద్రస్వామి వారి తిరుకళ్యాణ మహోత్సవం ఆదివారం అంగరంగవైభవంగా జరిగింది. ఈ సందర్భంగా దేవాలయంలో ఉదయం నాలుగు గంటల నుంచి సుప్రభాత సేవ, అభిషేకములు, అర్చనలు, మూలవర్తులకు కళ్యాణం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సుందరంగా తీర్చిదిద్దిన కళ్యాణ మండపం వద్ద ఉత్సవ మూర్తులను కూర్చోబెట్టి ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు కళ్యాణ తంతు నిర్వహించారు. శ్రీరాముని జన్మనక్షత్రమైన పునర్వసు నక్షత్రం అభిజిత్ లఘ్నమందు శ్రీఆత్మారామచంద్రస్వామి వారి కళ్యాణం సీతాదేవి అమ్మవారితో శాస్త్రయుక్తంగా నిర్వహించారు. కళ్యాణాన్ని తిలకించేందుకు గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు



చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కళ్యాణాన్ని తిలకించి స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. కళ్యాణం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో ఉత్సవ మూర్తులకు తిరువీధి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు అధ్యక్షుడు గోర్సా అశోక్‌కుమార్, కార్యనిర్వహణాధికారి జీ.సుదర్శన్, ధర్మకర్తల మండలి సభ్యులు కెల్లా శేఖర్, కుప్పిలి చిట్టిబాబు, ఉబ్బా నర్సింహారావు, కుర్సం రాజు, జిలకర ఉదయ్‌కుమార్, కంచర్ల స్వరూప, ఆలయ అర్చకుడు కొంపెల్లి సత్యనారాయణమూర్తి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మనోహరంగా రామయ్య కళ్యాణం

భద్రాచలంకల్చరల్, ప్రభాతవార్త :

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి కళ్యాణం మనోహరంగా సాగింది. ఉదయమే పవిత్ర గోదావరి నదీ తీరం నుండి తీర్థపు బిందెలో మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు నడుమ నదీ జలాలను తీసుకుని శ్రీస్వామి వారి మూలవరులకు, ఉత్సవమూర్తులకు అభిషేక కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లకీలో భక్తుల జయ జయ ధ్వానాల నడుమ శ్రీస్వామి వారి ఉత్సవమూర్తులను చిత్రకూట మండపానికి తీసుకుని వచ్చి ఆశీనులను చేశారు. అర్చకస్వాములు ముందుగా శ్రీస్వామి



వారి సహస్ర నామార్చన, తదుపరి క్షేత్ర మహోత్యాన్ని భక్తులకు వివరించారు. కళ్యాణతంతులో భాగంగా శ్రీస్వామి వారికి విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచన, శ్రీస్వామి వారి, అమ్మవార్ల ప్రవరలు, యోత్రధారణ,



కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, మహాసంకల్పం, మంగళాష్టకాలు, చూర్ణీత, సుముహూర్తం, మాంగళ్యపూజ, మాంగళ్య ధారణ, అక్షతారోపణ, వేదాశీర్వచనం, మంగళాశాసనంతో కళ్యాణతంతు ముగిసింది. కళ్యాణం జరుగుతున్నంత సేపు కళ్యాణంలో పాల్గొన్న దంప తులు కన్నులారా శ్రీసీతారామచంద్రస్వామి వార్లను చూస్తూ తరించి పోయారు. వేదపండితుల మంత్రోచ్చరణలకు తన్మయత్వంతో పులకరించి పోయారు. అనంతరం కళ్యాణంలో పాల్గొన్న దంపతులకు దేవస్థాన సిబ్బంది కళ్యాణలడ్డూ, శ్రీస్వామి వారి వస్త్రాలు, అక్షతలు పంపిణీ చేశారు.

# నేడే పార్లమెంట్ పోలింగ్







**- ఓటుహక్కును వినియోగించుకోనున్న 9,88,238 మంది ఓటర్లు**

**- ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్**

**- పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది**

**- ప్రతీ ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలి : కలెక్టర్**

**కొత్తగూడెం, మే 12 – ప్రభాతవార్త:**

పార్లమెంట్ ఎన్నికల సమయం ఆసన్నమైంది... ఎన్నికల ప్రచార పర్వం ముగియడంతో అతి ముఖ్యమైన ఘట్టం మొదలుకాబోతుంది... మరో కొన్ని గంటల వ్యవధిలో ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం అవుతుంది... సోమవారం పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే పోలింగ్ సమయం కేటాయించారు. దీంతో ఇప్పటికే ప్రజలకు తగిన సూచనలు చేశారు. ప్రతీ ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకునేలా కళాజాతాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 9,88,238 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నట్లు అధికారులు వెల్లడించారు. వీరిలో 4,79,626 మంది పురుషులు, 5,08,550 మంది మహిళలు, 62 మంది ట్రాన్స్‌జెండర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఓటుహక్కు వజ్రాయుధం అని, మీ ఓటుతో సరైన నాయకత్వాన్ని ఎన్నుకునే సమయం ఆసన్నమైందని, ప్రతీ ఒక్కరూ ఓటు వేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని అధికారులు తెలియజేయడంతో ప్రజలంతా తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు సంసిద్ధులయ్యారు. ఈ నేపథ్యంలో ఆదివారం జిల్లాలోని ఐదు నియోజకవర్గ కేంద్రాల్లో ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల ద్వారా ఎన్నికల సామాగ్రిని పంపిణీ చేశారు.

**- పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది**

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఆదివారం కొత్తగూడెం, ఇల్లెందు, పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రాల్లో ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను ఏర్పాటు చేసి ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి ఈవీఎంలతో పాటు అన్ని రకాల సామాగ్రిని పంపిణీ చేశారు. ఉదయం ఏడు గంటలకే ఆయా కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది తమకు అందజేసిన పోలింగ్ సామాగ్రిని సరిచూసుకున్నారు. అన్ని ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకొని చెక్‌లిస్టు తయారు చేసుకొని వాటిని బ్యాగుల్లో సర్దుకున్నారు. రూట్‌ల వారీగా అధికారులు అందించిన సామాగ్రితో మధ్యాహ్న భోజనం అనంతరం ఎన్నికల సిబ్బంది బయల్దేరి వెళ్లారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద సిబ్బంది చేరుకున్నారు. పోలింగ్ మెటీరియల్‌ను తీసుకొని పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. రాత్రి అక్కడే స్టే చేసిన తర్వాత ఉదయాన్నే లేచి కాలకృత్యాలు తీర్చుకొని పోలింగ్ ప్రక్రియను ప్రారంభించనున్నారు.

**– ప్రతీ ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలి : కలెక్టర్**

జిల్లాలో ఉన్న ఓటర్లందరూ పార్లమెంట్ ఎన్నికల్లో తప్పనిసరిగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ప్రియాంక ఆల తెలిపారు. జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడం జరిగిందని అన్నారు. ఉదయం ఏడు గంటల నుంచిసాయంత్రం 4 గంటల వరకు మాత్రమే ఓటింగ్ సమయం ఉందని, అందరూ సకాలంలో వచ్చి ఓట్లు వేయాలని చెప్పారు. ఓటర్లందరికీ పోల్ చిట్టీలు పంపిణీ చేశారని, అందరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని, పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని అన్నారు. ఓటు వేయడం మనందరి బాధ్యత అని, ఓటువేసి సరైన నాయకత్వాన్ని ఎన్నుకునే వజ్రాయుధం మీ చేతుల్లోనే ఉందని, తప్పక ఓట్లు వేయాలని అన్నారు.

# 2500 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు

**- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కట్టుదిట్టమైన చర్యలు**

**- జిల్లా ప్రజలంతా నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోవాలి**

**- జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు సూచనలు**



**కొత్తగూడెం క్రైం, మే 12 – ప్రభాతవార్త:**

సోమవారం జరిగే పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా భద్రతా పరమైన అన్ని రకాల చర్యలను పూర్తి చేసినట్లు జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు వెల్లడించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 2500 మంది పోలీసులతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు చ ఎప్పారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జిల్లాలోని 971 పోలింగ్ కేంద్రాల్లో జరగబోయే ఓటింగ్‌లో ప్రజలంతా నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. పోలింగ్ కేంద్రాల్లో మొబైల్ ఫోన్స్, ఇతర ఎలక్ట్రికల్ వస్తువులు, మంటను ప్రేరేపించే వస్తువులను అనుమతి లేదని, ప్రజలంతా ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ ఖచ్చితంగా అమలయ్యే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించే వ్యక్తులపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల్లో కానీ, పరిసర ప్రాంతాల్లో కానీ, ఓటర్లను ప్రలోభపెట్టే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టే విధంగా ఎవరైనా నగదు, మద్యం, ఇతరత్రా వస్తువులను ఎవరైనా పంపిణీ చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100కి ఫోన్ చేసి కానీ, సీ విజిల్ యాప్ ద్వారా కానీ ఫిర్యాదు చేసి సమాచారం అందజేయాలని కోరారు. పోలింగ్ కేంద్రాల నుంచి 100 మీటర్ల దూరంలో ఎవరు ఉండరాదని, ఎన్నికల నియమావళి ప్రకారం పోలీసులు చేపట్టే చర్యలను అతిక్రమిసేనత అట్టి వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రజాస్వామ్య బద్ధంగా జరిగే పోలింగ్ ప్రక్రియకు ప్రతీ ఒక్కరూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తే కఠిన చర్యలు

**ఓటర్లు స్వేచ్ఛగా ఓటింగ్‌లో పాల్గొనండి**

**ఓటర్లకు జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి వి.పి.గౌతమ్ పిలుపు**

**ఖమ్మం ప్రభాతవార్త:**



స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు, ఓటర్లను ప్రలోభాలు, ఒత్తిడులు, భయ భ్రాంతులకు గురిచేయడం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గంలో 53, ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 40 ఫ్లయింగ్‌స్క్వాడ్ టీములు అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ పటిష్ట నిఘా చేపడుతున్నాయని ఆయన అన్నారు. వీటికి తోడు 21ఎస్ఎస్టి టీములు, 37ఎంసిసి టీములు, 203 మంది సెక్టార్ అధికారులు క్రియాశీలకంగా పనిచేస్తున్నట్లు ఆయన అన్నారు. వ్యయ నోడల్ అధికారులు, వ్యయ పరిశీలకులు నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారన్నారు. జిల్లాలో నగదు జప్తు విషయమై పలు కేసులు నమోదు చేసినట్లు ఆయన అన్నారు. కూసుమంచి మండలం దేవునితండా వద్ద బీఆర్ఎస్ పార్టీ వారు ఓటర్లకు పంచడానికి తీసుకెళ్తున్న రూ.99.94,000లను నిఘా అధికారులు పట్టుకొని, నగదు జప్తు చేసి కేసు నమోదు చేశారన్నారు. మధిర మండలం నారాయణపురం వద్ద ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు రూ.170లక్షల పంపిణీకి తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు. మధిర మండల కేంద్రంలో ఓటర్లకు ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు నగదు పంచుతుండగా పట్టుకొని కేసు నమోదుచేశామన్నారు. మధిరలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు ఓటర్లకు పంచడానికి తరలిస్తున్న రూ.4,29,500లను జప్తు చేసి, కేసు నమోదు చేశామన్నారు. ఖమ్మం ఒకటవ టౌన్ పరిధిలో ఓటర్లకు పంచడానికి తీసుకెళ్తున్న రూ.45,650లను జప్తు చేసి కేసు నమోదు చేశామన్నారు. కారేపల్లి వద్ద బీజేపికి చెందిన వారు రూ.3,46,500లను ఓటర్లకు పంచడానికి తరలిస్తుండగా నిఘా బృందాలు పట్టుకొని, నగదు జప్తు చేసి కేసు నమోదు చేశామన్నారు. రాజకీయ నేతలు ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం చేస్తే, సంబంధిత అభ్యర్థులపై కేసు నమోదు చేయడం, నగదు, మెటీరియల్, వాహనాల జప్తు చేయడం జరుగుతుందని ఘటనలో దొరికిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని కఠిన చర్యలు చేపట్టడం జరుగుతుందని రిటర్నింగ్ అధికారి అన్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా నైతికతతో ఓటు వేయాలని, స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణకు అన్ని వర్గాల వారు తమ వంతు సహకారం అందించాలని రిటర్నింగ్ అధికారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## రూ.కోటి స్వాధీనం

**వాహనాన్ని వెంబడించిన పోలీసులు**

**అదుపుతప్పి బోల్తాకొట్టిన ఇన్నోవా**

**ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త:**



కూసుమంచి మండలం, కేశ్వాపురం సమీపంలో ఆదివారం ఉదయం ఓ ఇన్నోవాలో తరలిస్తున్న కోటి రూపాయలను ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది, కూసుమంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అట్టి ఇన్నోవాలో భారీగా డబ్బులు తరలిస్తున్నారు అనే సమాచారంతో అప్రమత్తం అయిన ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది,పోలీసులు వాహనాన్ని వెంబడించగా అట్టి వాహనం కేశ్వాపురం వద్ద అదుపుతప్పి పల్టీ కొట్టింది.ఈ క్రమంలో వాహనంలో ప్రయాణిస్తున్న ఓ యువకుడుకు తీవ్ర గాయాలు కాగా డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. ఇన్నోవాలో రెండు బ్యాగ్‌లు లభ్యం కాగా అందులో 99.96కోట్లు నగదు లభ్యం కాగా అట్టి నగదును సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

# ఎన్నికల ఏర్పాట్లు పూర్తి







## ఎన్నికల సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలి

## ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

## జిల్లా రిటర్నింగ్ అధికారి వి.పి.గౌతమ్

ఖమ్మం, మే 12, ప్రభాతవార్త: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ విధులను సిబ్బంది కట్టుదిట్టంగా నిర్వహించాలని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ అన్నారు. ఆదివారం ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఖమ్మం, పాలేరు అసెంబ్లీ సెగ్మెంట్ల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను కలెక్టర్, పోలీస్ కమీషనర్ సునీల్‌దత్‌తో కలిసి పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామాగ్రి పంపిణీ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన ఈవిఎం యంత్రాలను సదరు పోలింగ్ కేంద్రాల సిబ్బందికి అప్పజెప్పాలని రిజర్వ్ ఈవీఎం యంత్రాలు, రిజర్వు పోలింగ్ సామాగ్రి సెక్టార్ అధికారుల వద్ద భద్రంగా ఉండాలని, సెక్టార్ అధికారులు, పోలింగ్ సిబ్బంది ఎన్నికల నియమ, నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామాగ్రి అందజేసే కార్యక్రమాన్ని పరిశీలించడం జరిగిందని, పోలింగ్ కేంద్రాల్లో సజావుగా పోలింగ్ జరిగేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, ఖమ్మం జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 6గంటల వరకు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం, అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 4గంటలకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఉన్న 1896 పోలింగ్ కేంద్రాల వద్ద మే-13న ఖమ్మం పార్లమెంటు స్థానానికి పోలింగ్ నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని, వేసవి దృష్టిలో ఉంచుకొని ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ప్రజలకు అవసరమైన చల్లని నీరు, క్యూలైన్ల వద్ద టెంట్, ఇతర సౌకర్యాలు కల్పించామని అన్నారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించామని తెలిపారు. ఓటర్లందరూ తప్పనిసరిగా మే 13న జరిగే పోలింగ్‌లో పాల్గొనేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చి వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లాలో ఎవరైనా ప్రలోభాలకు గురి చేయటం, ఉల్లంఘనలు దృష్టికి వస్తే సి-విజిల్ యాప్‌కు 1950 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ ఎన్నికల్లో మనం వేసే ఓటు మన భవిష్యత్తును నిర్దేశిస్తుందని ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా ప్రజలు ఆలోచించి, స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, సహాయ రిటర్నింగ్ అధికారులు ఆదర్శ్‌సురభి, ఎం.రాజేశ్వరి, అధికారులు తదితరులు ఉన్నారు.

# పక్కా వ్యూహం - పకడ్బందీ ఏర్పాట్లు

## విధి నిర్వహణలో అలసత్వం వద్దు

## పోలీస్ కమిషనర్ సునీల్‌దత్



క్రైం ఖమ్మం, మే 12, ప్రభాతవార్త: విధి నిర్వహణలో పోలీసుల అలసత్వం వహించరాదని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉండే విధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నేడు జరగనున్న ఎన్నికల పోలింగ్ దృష్టిలో పెట్టుకొని పోలీస్ అధికారులు సిబ్బందికి విధి విధానాలపై జిల్లా పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ పలు సూచనలు చేశారు. ఖమ్మం జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ముందుగా పోలీస్ పెట్రోలింగ్ బృందాలు సైతం ఏర్పాటు చేశారు. వీరందరు నిత్యం అందుబాటులో ఉంటూ ఆయా కేంద్రాల వద్ద ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించే నేరచరిత్రుల్లో సైతం ముందుగానే బైండోవర్ చేశారు. జిల్లాకు 6 కంపెనీల బలగాలతో పాటు 2390 మంది స్థానిక పోలీసులు టిఎస్ఎస్‌పి బెటాలియన్‌తో పాటు వివిధ విభాగాల నుండి పోలీస్ సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారు. ఎన్నికల విధుల్లో కేవలం ఓటర్లకు బందోబస్తు మాత్రమే వినియోగం సందర్భంగా అక్కడ ఏ రాజకీయ పార్టీలతో మమేకం కాకుండా విధులు జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. ఎవరు కూడా అత్యుత్సాహం ప్రదర్శించకూడదని భద్రత పాలన చర్యల్లో అప్రమత్తంగా ఉండాల్సిన ఆవశ్యకతను వివరించారు. పోలింగ్ నమోదు నుండి మొదలుకొని ముగింపు ప్రక్రియ వరకు విధుల్లో జాగ్రత్తలతో పాటు కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత విధులు నియంత్రణలో అలసత్వంపై కూడా సహించే ప్రసక్తి ఉండదని పలు సూచనలు చేశారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు వినియోగంలో ఉన్న అధికారులు సిబ్బంది ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడడంతో పాటు ఆరోగ్యాలు బారిన పడకుండా డ్యూటీయే ముఖ్యంగా భావించి ఓటర్లకు సహకరిస్తూ అక్కడ ఏర్పాటు చేసిన ఎన్నికల అధికారులు సిబ్బంది విషయాల్లో కూడా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పోలింగ్‌కు రెండు రోజుల ముందు మద్యం, నగదు అక్రమ రవాణా కట్టడి చేశామని కమీషనరేట్ పరిధిలో వాహనాల తనిఖీపై దృష్టి సారించాలని వివరించారు. ఇది ఇలా ఉండగా కమీషనరేట్ పరిధిలోని ఖమ్మం రూరల్ ఏసిపి ఆధ్వర్యంలో ఆదివారం కూసుమంచి పోలీస్ స్టేషన్ పరిధిలో దేవునితండా వద్ద ఇన్నోవా వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 99.94లక్షల రూపాయలు గుర్తించి కేసు నమోదు అనంతరం ఆదాయపు శాఖ అధికారులకు సమాచారం అందించడం జరిగిందని కమీషనర్ సునీల్‌దత్ తెలిపారు.




ఖమ్మం, కార్పొరేషన్, రఘునాథపాలెం, కల్చరల్, ఖమ్మం రూరల్



## బాలవికాస్ సమ్మర్ క్యాంప్ ముగింపోత్సవం

ఖమ్మం కల్చరల్, మే 12, ప్రభాతవార్త: వివేకానంద ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో గత 15రోజులుగా జరుగుతున్నటువంటి బాలవికాస్ సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సంస్థ డైరెక్టర్ దేవకి వాసుదేవరావు హాజరయ్యారు. బాల వికాస్ కార్యక్రమంలో యోగా, శ్లోకాలు, భజనలు, హ్యాండ్ రైటింగ్, డ్రాయింగ్ మరియు స్వామివివేకానంద జీవిత చరిత్ర అనే అంశాలపై శిక్షణ జరిగింది. దాంతో పాటు వ్యక్తిగత క్రమశిక్షణ, నైతిక విలువలు, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ వంటి అంశాలను విశదీకరించడం జరిగింది. ఈ సందర్భంగా దేవకి వాసుదేవరావు మాట్లాడుతూ బాల్యంలోనే పిల్లలకు క్రమశిక్షణ ఆధ్యాత్మికత ఉంటే భవిష్యత్తులో అద్భుతమైన వ్యక్తులుగా రూపొందే అవకాశం ఉందని వారు భావి భారత పౌరులుగా దేశానికి ఎంతో సేవ చేస్తారని తెలిపారు. విద్యార్థులు నేర్చుకున్నటువంటి అంశాలపై ప్రతిభను చూపించారు. గత 45రోజులుగా ఏసి ఇన్సాలేషన్ అండ్ సర్వీస్ ట్రైనింగ్ తీసుకున్న విద్యార్థులకు కూడా సర్టిఫికేట్స్ ప్రదానం చేయడం జరిగింది. యువతకు సరైన శిక్షణ ఇచ్చి వారిని ఆర్థికంగా శక్తివంతులు చేసే విధంగా ఈ కార్యక్రమం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ బాధ్యులు కేశవలాల్ పటేల్, చంద్రశేఖర్, చారి, లలిత, రాముడు, స్నేహలత, ఆశోక్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మాతృత్వం ఒక వరం

### - డాక్టర్ శోభాదేవి

### - పారిశుద్ధ్య కార్మికులకు ఘన సన్మానం



కార్పొరేషన్, మే 12, ప్రభాతవార్త: జీవరాశులన్నింటిలోను అత్యంత నిస్వార్థ సేవకురాలు అమ్మేనని, ఆమె సేవలు వెలకట్టలేమని, అమ్మ ఎన్ని బాధలు పడినా పిల్లలు బాగుండాలని అని కోరుకుంటుందని అంతర్జాతీయ తల్లుల దినోత్సవం పురస్కరించుకొని ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ నందు ఏర్పాటు చేసిన మాతృ దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రముఖ డాక్టర్ పేర్ల శోభాదేవి కొనియాడారు. ఆదివారం ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్స్ వాకర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ రాకం శ్యామ్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఘనంగా మహిళామూర్తులకు పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. మాతృదినోత్సవ కార్యక్రమంలో డాక్టర్ సీతయ్య, మహిళా ప్రతినిధి మచ్చ లక్ష్మీలు మాతృత్వం గొప్పతనాన్ని గురించి తెలియజేశారు. అంతర్జాతీయ మాతృ దినోత్సవానికి పలువురు దాతలు సహృదయాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొండమీది వెంకట్, ట్రెజరర్ సుదర్శన్, ఎఐటియుసి మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మంద వెంకటేశ్వర్లు, నర్సింహారావు, శంకర్‌గౌడ్‌లు 44,45 డివిజన్ పారిశుద్ధ్య కార్మికులకు శాలువాలతో సత్కరించి ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సంధ్య, మాధవి, రజని, సౌజన్య, రమ, పద్మ, రాణి, లక్ష్మి, కళావతి, దయామని తదితరులు పాల్గొన్నారు.




## నర్సులకు సన్మానం

మణుగూరు, ప్రభాతవార్త, మే 12 :



అంతర్జాతీయ నర్సు దినోత్సవాన్ని పురస్కరించుకొని సింగరేణి సంస్థ మణుగూరు ఏరియా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న స్టాఫ్‌నర్సులను ఏరియా టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించినట్లు ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఇన్‌చార్జి నాగెల్లి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యురాలు సమ్మక్క, నాయకులు ఇజ్రాయిల్, పాండురంగయ్య, పద్దం శ్రీను, వినయ్, రేవన్ ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి

**తహసీల్దార్ సూర్యనారాయణ**

పినపాక, మే 12, ప్రభాతవార్త




నేడు జరగనున్న ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ సూర్యనారాయణ తెలిపారు. మండల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన ఆదివారం స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలోని విద్యుత్ సౌకర్యం, మంచినీటి వసతి, మూత్రశాలలు, వృద్ధులకు, దివ్యాంగులకు ర్యాంపులు పరిశీలించారు. పోలింగ్ నిర్వహించే సిబ్బందికి ఎలాంటి అసౌకర్యాలు కల్పించరాదని, అదేవిధంగా వారికి వసతి, భోజన సౌకర్యం కల్పించాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో సిసి కెమెరాలతో పాటు ఓటర్లకు మంచినీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు.

## చిన్నఅరుణాచలంలో లక్షమల్లెలతో స్వామి వారికి అభిషేకం

దుమ్ముగూడెం, ప్రభాతవార్త :



దుమ్ముగూడెం మండల పరిధిలోని నర్సాపురం గ్రామంలో వెలసి ఉన్న ద్వాదశ జ్యోతిర్లింగక్షేత్రం చిన్న అరుణాచలంలో అరుచలేశ్వర స్వామి వారికి ఆదివారం లక్షమల్లెలతో అభిషేకం, అలంకరణ నిర్వహించారు. వైశాఖ శుద్ధ పంచమి, ఆదిశంకర రాచార్యుల జన్మదినోత్సవం అరుణాచలేశ్వర స్వామి వారి యొక్క జన్మనక్షత్రం సందర్భంగా లక్ష మల్లెలతో అలంకరణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ వ్యవస్థాపకుడు శివనాగస్వామి తెలిపారు. అనేకమంది భక్తులు అరుణాచలేశ్వర స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

# మహిళా ఆదర్శ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

మణుగూరు, ప్రభాతవార్త, మే 12 : నేడు జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా పినపాక నియోజకవర్గంలోని మణుగూరు మండల కేంద్రంలో మహిళల కోసం ప్రత్యేకంగా రెండు మహిళా ఆదర్శ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మహిళా ఆదర్శ పోలింగ్ కేంద్రం (140వ పోలింగ్ స్టేషన్) మణుగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గర్ల్స్ హైస్కూల్ నందు 900 మంది ఓటర్లు ఉండగా.. ఇందులో 431మంది పురుషులు, 468మంది మహిళా ఓటర్లు, ఒక థర్డ్ జండర్ ఓటరు ఉన్నారు. మహిళా ఆదర్శ పోలింగ్ కేంద్రం (121వ




పోలింగ్ కేంద్రం) మణుగూరు స్త్రీశక్తి భవన్‌లో 864మంది ఓటర్లు ఉండగా.. ఇందులో 430మంది పురుషులు, 434మంది మహిళా ఓటర్లు ఉన్నారు. మహిళల ఓటింగ్ శాతాన్ని పెంచడమే ధ్యేయంగా ఎన్నికల సంఘం మహిళా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తుండగా.. అందులో భాగంగా మహిళలను ఆకట్టుకునేలా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేసి అందంగా తీర్చిదిద్దారు. పినపాక నియోజకవర్గంలో మొత్తం 2,03,790 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1,03,899 మంది మహిళా ఓటర్లు ఉండగా.. పురుషులు 99,886 మంది, మరో 5మంది థర్డ్‌జండర్ ఓటర్లు ఉన్నారు. మొత్తం 250 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. సుమారు 1300మంది సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహించనున్నారు.

# పినపాకలో పోలింగ్‌కు సర్వం సిద్ధం

**-ఎన్నికలు సజావుగా జరిగేలా అవసరమైన చర్యలు**

**-పినపాకలో 2,03,790 మంది ఓటర్లకుగాను 250 పోలింగ్ కేంద్రాలు**

**-ప్రత్యేక వాహనాల్లో ఎన్నికల సామాగ్రి ఎస్కార్ట్ ద్వారా తరలింపు**

**-పినపాక ఏఆర్వో, భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్**

మణుగూరు, ప్రభాతవార్త, మే 12 : నేడు పినపాక నియోజకవర్గంలో లోక్‌సభ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు, అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పినపాక ఏఆర్వో, భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ తెలిపారు. ఆయన ఆదివారం మణుగూరు జెడ్పీ కో-ఎడ్యూకేషన్ హై స్కూల్‌లో పోలింగ్ కేంద్రాలకు అవసరమైన సామాగ్రి పంపిణీ చేసి సిబ్బందిని ఎస్కార్ట్ ద్వారా పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సజావుగా ఎన్నికలు జరిగేలా అవసరమై అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఇందుకు ప్రజలు సహకరించాలని అన్నారు. పినపాక




నియోజకవర్గం అంతటా 13 తారీఖు సాయంత్రం వరకు 144 సెక్షన్ కింద నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయన్నారు. పినపాక నియోజకవర్గం వ్యాప్తంగా 250 పోలింగ్ కేంద్రాలకు అవసరమైన సామాగ్రి, సిబ్బందిని ఎస్కార్ట్ ద్వారా పంపించడం జరిగిందన్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 1300 మంది పోలింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని, ప్రతి పోలింగ్ స్టేషన్‌లో పీవో, ఏపీవో, ఓపీవోలతోపాటు సెక్టార్ ఆఫీసర్లు, పోలీసు సిబ్బంది ఎన్నికల విధుల నిర్వహణలో పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. ఏజెన్సీలోని మారుమూల మండలాలైన గుండాల, ఆళ్లపల్లి సెక్టార్లకు సంబంధించిన పోలింగ్ స్టేషన్లకు ప్రత్యేక పోలీస్, సీఆర్‌పీఎఫ్ బలగాల సెక్యూరిటీతో పోలింగ్ సామాగ్రి ముందుగా పంపించడం జరిగిందన్నారు. ప్రతి సెక్టార్ రూట్‌ల వారీగా పోలింగ్ స్టేషన్ బట్టి సిబ్బందిని చేరవేయడానికి రెండు బస్సుల చొప్పున ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పినపాక నియోజకవర్గంలో 2,03,790 మంది ఓటర్లు ఉన్నారని ఇందుకోసం 250 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలలో 50 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని మరో 200 సాధారణ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. మొత్తం 30 రూట్లు ఉన్నాయని, అంతటా వెబ్ కాస్టింగ్ ఏర్పాటుతోపాటు సీసీ కెమెరాలు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సుమారు 50 బస్సుల్లో ఎన్నికల సామాగ్రిని, ఎస్కార్ట్ ద్వారా ఏడు మండలాలకు తరలించామన్నారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ నియోజకవర్గం వ్యాప్తంగా 2,03,790 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారని, ఇందులో మహిళలు 1,03,899 పురుషులు 99,886 థర్డ్ జండర్స్ 5 ఉన్నారని అన్నారు. 250 పోలింగ్ స్టేషన్లకు గాను 30 మంది సెక్టార్ అధికారులు 60 మంది మైక్రో అబ్జర్వర్లు, ప్రతి పోలింగ్ స్టేషన్‌కు పీవో, ఏపీవో, ఓపీలు, రిజర్వ్ పోలింగ్ సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్వో రాఘవరెడ్డి, నాగరాజు, దేవిద్‌రాజు, మణెమ్మ, శ్రీనివాస్, రమణయ్య, నర్సింహారావు, హరికృష్ణ, ముజాయిద్, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పినపాకలో భారీ భద్రత చర్యలు

**-ఏజెన్సీలో ఎన్నికల కోసం ప్రత్యేక బలగాలతో పోలీసు బందోబస్తు**

**-లోక్‌సభ ఎన్నికల విధుల్లో 500 మంది పోలీసులు**

**-మణుగూరు డీఎస్పీ వి.రవీందర్‌రెడ్డి**

మణుగూరు, ప్రభాతవార్త, మే 12 : పినపాక నియోజకవర్గంలో లోక్‌సభ ఎన్నికల కోసం భారీ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ప్రత్యేక కేంద్ర బలగాలతో పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు మణుగూరు డీఎస్పీ వి.రవీందర్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం మణుగూరు జెడ్పీ కో ఎడ్యుకేషన్ హై స్కూల్‌లో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేకంగా పోలీసు కంట్రోల్ రూం ఏర్పాటు చేసి ఎన్నికల



విధులు నిర్వహించే సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు కేటాయించి తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పినపాక నియోజకవర్గంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించి పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రత్యేకంగా సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. పినపాక ఏజెన్సీలో మావోయిస్టు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాలతో పాటు ఏఆర్, సీఆర్‌పీఎఫ్, స్థానిక పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నామని అన్నారు. పినపాక నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో కేంద్ర బలగాలతోపాటు 500 మంది పోలీసు సిబ్బందిని వినియోగిస్తున్నామని, ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద పటిష్టమైన భద్రత చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇప్పటికే 144 సెక్షన్ అమలులో ఉందని ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా 500 మంది సిబ్బందితోపాటు కేంద్ర బలగాలు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి మండలంలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ ఉందని, ప్రతి రూట్‌లో పోలీసు పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఎన్నికల విధుల్లో ఇతర డిపార్ట్మెంట్లు, హోం గార్డులు, సివిల్ పోలీసులతోపాటు ఏడుగురు సీఐలు, 20 మంది ఎస్సైలు, 50 మంది ఏఎస్సైలు, ఒక్క డీఎస్పీ పర్యవేక్షణ ఉంటుందన్నారు. 250పోలింగ్ కేంద్రాల పరిధిలో 30 రూట్లు ఉన్నాయని, నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో 50 పోలింగ్ స్టేషన్లు, ఒక అతిసమస్యాత్మక పోలింగ్ స్టేషన్, మరో 199 సాధారణ పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని ఆయన తెలిపారు. తొలుత పోలింగ్ విధుల్లో పాల్గొనే పోలీసు సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మణుగూరు సీఐ ఎస్ సతీష్‌కుమార్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పొలిటికల్ మీటింగ్‌లో కండువతో ప్రభుత్వ ఉద్యోగి హల్చల్...!

**-పార్టీ కండువతో ఉన్న ఫోటో సోషల్ మీడియాలో వైరల్..**

**-ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం...?**

*కాళేశ్వరం, మే 12, ప్రభాతవార్త*

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్‌ఈఓగా విధులు నిర్వహిస్తున్న స్వామి ఓ రాజకీయ పార్టీకి చెందిన కండువా మెడలో వేసుకొని నాయకులతో పక్క జిల్లాలోని కన్వెన్షన్ హాలులో జరిగిన మీటింగ్ లో పాల్గొని



ప్రముఖ పార్టీ పార్లమెంట్ అభ్యర్థికి ప్రత్యక్షంగా మద్దతు తెలుపుతున్నట్లు సోషల్ మీడియాలో ఫోటో వైరల్ అయింది. ఇదే విషయాన్ని కొంతమంది వ్యక్తులు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రాకు ఫిర్యాదు చేశారని విశ్వసనీయ సమాచారం. ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ పార్టీ మీటింగ్ లో గాని ప్రచారాలకు కానీ ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరించకూడదని నిబంధనలు ఉన్న ఎలక్షన్ కమిషనర్ ఆదేశాలను బేతకర్ చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన వారే ఇలా రాజకీయ నాయకులతో కలిసి పార్టీ కార్యక్రమంలో పాల్గొనడం ఏమిటని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై కాళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ సుస్మిత ను 'ప్రభాతవార్త' వివరణ కోరగా. వైద్య శాఖ నుండి ఎలాంటి కార్యక్రమాలు లేవని, ఇట్టి విషయం గురించి తమ దృష్టికి రాలేదని వారు వివరించారు.

## తల్లిదండ్రులకు పిల్లలు అండగా ఉండాలి

**-మాతృమూర్తుల సేవలు వెలకట్టలేనివి**

**-డిహెచ్‌పి కార్యనిర్వాహక్ గొర్రె చిట్టిబాబు**

*మహబూబాబాద్,మే12,ప్రభాతవార్త*



ప్రపంచంలో ప్రేమకు, త్యాగానికి ప్రతిరూపం అమ్మ అని మాతృమూర్తుల సేవలు వెలకట్టలేనివని దళితహిందూ పరిషత్ కార్యనిర్వాహక్ గొర్రె చిట్టిబాబు అన్నారు. మాతృదినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక గుమ్మునూరులో డిహెచ్‌పి ఆధ్వర్యంలో పెద్దఎత్తున మహిళలను సన్మానించడంతో పాటు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు గంగుల వెంకటయ్య సతీమణి శాంభవికి పట్టువస్త్రాలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవమాసాలు మోసి కనిపెంచిన తల్లి రుణం ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేమని వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు అందరూ అండగా ఉండాలన్నారు. భారతీయ సాంస్కృతి, సాంప్రదాయాలు ఉన్నతమైనవని నాగరిక వ్యవస్థకు కుటుంబమే మూలాలని అన్నతమ్ముళ్లు, అక్కాచెల్లెళ్లు, భార్యభర్తలు ఇలా అనేక బాంధవ్యాలు ఉన్నప్పటికీ అందులో అమ్మకు మరేది సాటి రాదన్నారు. ఈ కార్యక్రమంలో దళితహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు సాయిలమ్మ, గంగుల శ్రీనివాస్, సంధ్యారెడ్డి, సూరమ్మ, కన్నా, మాదారమ్మ, విశ్వనాథ్, పరుశురాములు, మహేశ్వరి, శారధ తదితరులు పాల్గొన్నారు.

## సేవకు ప్రతిరూపం..సేవకురాళ్లు

**-సివిల్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఫృధ్వీ**

*చిట్యాల, మే 12, ప్రభాతవార్త*



రోగులకు ఉత్తమ సేవలందిస్తూ నర్సులు, సేవకురాళ్లు తరిస్తున్నారని సివిల్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఫృధ్వీ అన్నారు. మండలకేంద్రంలోని సివిల్ ఆసుపత్రిలో అంతర్జాతీయ నర్సులా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వైద్యులు ఫృధ్వీ మాట్లాడుతూ..మదర్ థెరిస్సా చేసిన సేవలను గుర్తు చేశారు. నర్సులు వైద్యులతో సమానం అని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ ఫృధ్వీ, హెడ్ నర్సు నీరజ రాణి, స్టాఫ్ నర్సులు స్వప్న, అనిత, కవిత, శ్వేత, సంధ్య, సునీత, ఏఎన్‌ఎంలు మీనాక్షి, కోమల దేవి, ఆసుపత్రి సిబ్బంది ల్యాబ్ టెక్నిషియన్ నూతి మహేందర్, ఎంఎన్‌ఓ చంద్రశేఖర్, పుల్ల సతీష్ కుమార్, రాయిని శ్రీకాంత్, ఉప్పల కిరణ్, కుమార్, రాజేందర్, వనిత, రాధ, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మండలకేంద్రానికి చేరుకున్న సిబ్బంది

*చిట్యాల, మే 12, ప్రభాతవార్త*



నేడు జరుగనున్న పార్లమెంటు ఎన్నికల కోసం జిల్లా అధికారులు కేటాయించిన సిబ్బంది మండలకేంద్రానికి చేరుకున్నారు. ఈవీఎం ప్యాడ్‌తో పాటు ఇతర సామాగ్రితో మండలకేంద్రానికి చేరి రిపోర్ట్ చేశారు. సోమవారం జరిగే ఎన్నికల కోసం అధికారులు మండలంలో నిర్వహించే 38పోలీంగ్ స్టేషన్‌లలో అన్ని ఏర్పాట్లు చేశారు. ట్రాన్స్‌జెండర్ ఒకటి, 14702మంది పురుషులు, 15636మంది స్త్రీలు మొత్తం 30,339 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు ఎన్నికల అధికారి తాసీల్దార్ ఖాజా మొహియుద్దీన్ తెలిపారు. ఉదయం ఆరు గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలీంగ్ ఉంటుందని చెప్పారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

**-సర్వం కోల్పోయి బోరున విలపించిన బాధితురాలు**

*మల్హర్‌రావు, మే 12, ప్రభాతవార్త*

మండలంలోని నాచారం గ్రామపంచాయతీ పరిధిలో గల మల్లయ్యపల్లెలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఎడ్ల లక్ష్మీ నరసమ్మ అనే మహిళ గుడిసె ఆదివారం పూర్తిగా కాలి బూడిదైంది. దీంతి బాధితురాలు కన్నీరు మున్నీరుగా విలపిస్తూ సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలానని పత్తి అమ్మిన పైసలు రూ.28వేలు, తులంనర బంగారు గొట్టాల గొలుసు, 50కిలోల సన్న బియ్య, 70కిలోల దొడ్డు బియ్యం, బట్టలు మరియు ఇతరత్రా సామాగ్రి మంటల్లో కాలిపోవడం జరిగిందని బాధితురాలు విలపించింది. సంఘటన స్థలానికి చేరుకున్న కాంగ్రెస్ బూత్ కమిటీ అధ్యక్షులు కన్నూరి అశోక్, సోషల్ మీడియా మండల కో-ఆర్డినేటర్ దొగ్గేల సంపత్, ఎట్లా భాస్కర్, చేపూరి దేవరాజు సహాయక చర్యలు చేపట్టారు. బాధితురాలిని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ఆరోగ్య మిత్ర రాజమౌళికి సన్మానం

*చిట్యాల, మే 12, ప్రభాతవార్త*



చిట్యాల మండల కేంద్రం లోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోగ్య శ్రీ విభాగంలో ఆరోగ్య మిత్రగా విధు లు నిర్వహిస్తు న్న మండలకేంద్రమైన రాంనగర్ కాలనీకి చెందిన గుర్రపు రాజమౌళిని చేయూత ఫౌండేషన్ ఛైర్మన్ మ్యాదరి సునీల్, ప్రధాన కార్యదర్శి జెట్టి శంకర్, సినీ గేయ రచయిత బండి తస్యం, కళాకారులు కలసి ఉత్తమ సేవలు అందిస్తున్న ఆరోగ్య మిత్ర రాజమౌళిని శాలువాతో ఘనంగా సన్మానం చేసి ప్రశంసా పత్రాన్ని అందించారు. ఈసందర్భంగా చేయూత ఫౌండేషన్ ఛైర్మన్ సునీల్ మాట్లాడుతూ..తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా కరోనా సమయంలో విశిష్టమైన ఉత్తమ సేవలందించి రోగులకు ఆరోగ్యమైన సలహలు, సూచనలు ఇస్తూ ఉత్తమ సేవలు అందించారని కొనియాడారు. అదేవిధంగా ఆరోగ్యశ్రీ విభాగంలో ఎంతోమంది రోగులకు ఆరోగ్య శ్రీ కార్డు ద్వారా ఉచితంగా వారికి నాణ్యమైన వైద్యం అందించడంతో ఆరోగ్య మిత్ర రాజమౌళి చేసిన కృషి అమోఘం అన్నారు. ఈకార్యక్రమంలో మండలకేంద్రం ఎంపిటీసీ దబ్బెట అనిల్, ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి జెట్టి శంకర్, కళాకారులు, రచయితలు, సింగర్స్ జన్నే యుగంధర్, దాసారపు నరేష్, బానోతు రాజు నాయక్, వీణవంక శ్రీదేవి, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కీర్తిబాయి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటాం

**-శ్రీపాద ట్రస్ట్ ఛైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు**

**-కీర్తిబాయి కుటుంబ సభ్యులను పరామర్శించిన శ్రీనుబాబు**

*మహముత్తారం, మే 12, ప్రభాతవార్త*



పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు జాడీ కీర్తిబాయి, తన భర్త జాడి రాజయ్యతో కలిసి కారులో మహాముత్తారం మండలంలో ప్రయాణిస్తుండగా ప్రమాదవశాత్తు జరిగిన ప్రమాదంలో కీర్తిబాయి అక్కడికక్కడే మృతి చెందగా జాడీ రాజయ్యకు తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణలు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కాగా ఆదివారం మంత్రి శ్రీధర్‌బాబు సోదరుడు, శ్రీపాద ట్రస్ట్ ఛైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు కీర్తిబాయి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కీర్తిబాయి ఆత్మశాంతి చేకూరాలని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కీర్తిబాయి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని శ్రీనుబాబు భరోసా కల్పించారు. ఒక మంచి మహిళా నాయకురాలిని కోల్పవడం దురదృష్టకరమని అన్నారు. వారితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## ఘనంగా మాతృదినోత్సవ వేడుకలు

*మహబూబాబాద్ నెహ్రూసెంటర్,మే12,ప్రభాతవార్త*



జిల్లాకేంద్రంలోని స్థానిక హరిజనవాడలో ఆదివారం మాతృదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 99సంవత్సరాల దాసరి గురువమ్మకు అతని కుమారుడు రాములు- ఈశ్వరమ్మ దంపతులు పాదాభివందనం చేశారు. ఆమెకు చీరె, పండ్లు అందజేసి ఆమెతో కేక్ కట్‌చేయించి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ దాసరి హర్షికరావిష్, బంధుమిత్రులు, స్థానికులు పాల్గొన్నారు.

## స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సహాయం

*నెల్లికుదురు, మే 12, ప్రభాతవార్త*

మండలంలోని శ్రీరామగిరి గ్రామానికి చెందిన పోరెండ్ల మనోజ్‌కుమార్



ఇటీవల అకాల మృతిచెందిన విషయం విధితమే.కాగ మృతుడు మనోజ్‌కుమార్ 2008..09 విద్యాసంవత్సరంలో మండల కేంద్రంలోని గీతాంజలి ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన 10వ తరగతికి చెందిన తోటి స్నేహితులు ఆదివారం కుటుంబ సభ్యులను పరామర్శించి,ప్రగాఢ సంతాపం తెలిపిన అనంతరం ఆర్థిక సహాయం అందచేశారు. తోటి స్నేహితులు వరిపెల్లి వెంకటేష్,మద్ది రాజేష్, పొతుగంటి సుధాకర్,బిట్ల విజయ్,వేముల వినోద్,గుగులోతు నరేష్, మౌనిక, స్పందన, సృజన, విజయలక్ష్మి, జి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ అధికారులు ఎన్నికల సామాగ్రి సరిచూసుకోవాలి

**-జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్‌రిజ్వాన్ భాషా**

ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ : పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ నిర్వహణకై ఎన్నికల పోలింగ్ అధికారులు స్వీకరిస్తున్న సామాగ్రిని జాబితా ప్రకారం సరిచూసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా తెలిపారు. ఆదివారం పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోలింగ్ సామాగ్రి పంపిణీ కొరకు ఏర్పాటు చేసిన జిల్లాలోని జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి అసెంబ్లీ సెగ్మెంట్ల రిసెప్షన్ సెంటర్లను ఆయా సహాయ రిటర్నింగ్ అధికారులతో కలిసి సందర్శించి పరిశీలించారు. ఈసందర్భంగా పంపిణీ చేస్తున్న సామాగ్రిని కలెక్టర్ సందర్శించి ప్రత్యక్షంగా పరిశీలించారు.



పోలింగ్ నిర్వహించే అధికారులు సామాగ్రిని జాబితా ప్రకారంగా పరిశీలించుకోవాలని జాబితాలోసూచించిన విధంగా ప్రతీ ఒక్కటి తప్పనిసరిగా తీసుకుని వెళ్లాలన్నారు. అనంతరం పోలింగ్ అధికారులకు ఏర్పాటుచేసిన బోజన వసతిని పరిశీలించారు. వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేయడం జరిగిందని అధికారులకు తెలియచేశారు. సకాలంలో ఎన్నికల పోలింగ్ సామాగ్రి స్వీకరణ అనంతరం ఏర్పాటుచేసిన వాహనాలపై పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పోలింగ్ నిర్వహణను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. నిర్ణీత వ్యవధిలో పోలింగ్‌శాతం నివేదికలను అందించాలన్నారు. కలెక్టర్ వెంట పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, డీఎస్.వెంకన్న, దేవరాయి కొమురయ్య, ఎన్నికల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ నమోదును సత్వరం అందించేందుకు అవగాహన పొందాలి

**-జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్‌రిజ్వాన్ భాషా**

ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :



సోమవారం నిర్వహించే పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి ఓటింగ్ నమోదు శాతాన్ని సకాలంలో పంపించేందుకు అధికారులు డాటా నమోదు సిబ్బంది పూర్తిస్థాయిలో అవగాహన పొందాలని జిల్లా ఎన్నికల అధికారి షేక్ రిజ్వాన్‌భాషా తెలిపారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో లోక్‌సభ సాధారణ ఎన్నికలు-2024సందర్భంగా ఈనెల 13(సోమవారం) నిర్వహించే పోలింగ్ సమాచార నివేదికలు సకాలంలో జిల్లాకేంద్రానికి అందేలా మూడుసెగ్మెంట్లకు సంబంధించి ఇంటిగ్రేటెడ్ కమ్యునికేషన్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. 98-జనగామ, 99-స్టేషన్‌ఘన్‌పూర్, 100-పాలకుర్తి నియోజకవర్గాలను మూడు బృందాలుగా చేసి ఉదయం 7గంటల నుంచి నిర్వహిస్తున్న పోలింగ్‌ను ప్రతీ రెండుగంటలకు నివేదికలు అందించేలా శిక్షణ ఇప్పించారు. ఉదయం 9గంటలకు, 11గంటలకు, అలాగే మధ్యాహ్నం ఒంటిగంటకు, సాయంత్రం 3గంటలకు, 5గంటలకు సకాలంలో సమాచారం అందేవిధంగా సెగ్మెంట్ల వారీగా కంప్యూటర్స్‌ను ఏర్పాటు చేసి జిల్లా అధికారులను పర్యవేక్షణ నిమిత్తం నియమించారు. అధికారుల ఆధ్వర్యంలో డాటా ఆపరేటర్లను ఏర్పాటు చేసి సకాలంలో నివేదికలు పంపించేలా ఈ డిస్ట్రిక్ మేనేజర్, ఎన్ఐసీ అధికారులతో సాంకేతికపరంగా శిక్షణ ఇప్పించారు. డాటా ఆపరేటర్లను అప్రమత్తం చేసుకోవాలని నివేదికలు సకాలంలో పంపించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్, జడ్పీ సీఈవో అనిల్‌కుమార్, డీఆర్‌డీఓ మొగులప్ప, ఎన్ఐసీ రాంప్రసాద్, ఈడీఎం దుర్గారావు, మూడు నియోజకవర్గాలకు కేటాయించిన జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో రవీందర్, ఎలక్షన్ సెక్షన్ అధికారులు శ్రీనివాస్, శంకర్, సతీష్, డాటా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కరెంట్‌షాక్‌తో దుక్కిటెద్దు మృతి

పాలకుర్తి, మే 12 ప్రభాతవార్త: పాలకుర్తి మండలం గూడూరు గ్రామంలోని కుంట నర్సయ్య తండ్రి బక్కయ్య దుక్కిటెద్దు విద్యుత్‌షాక్‌తో మృతిచెందింది. సుమారు దాని విలువ రూ.50వేలు ఉంటుందని, ప్రభుత్వం వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు ఆవేదన వ్యక్తంచేశారు.



## వైభవంగా శ్రీసోమేశ్వర ఆలయంలో ఆరుద్రోత్సవం

**-108లీటర్ల ఆవుపాలతో ఏకాదశ రుద్రాభిషేకం**

పాలకుర్తి, మే 12 ప్రభాతవార్త :



పాలకుర్తి మండలకేంద్రంలో శ్రీసోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని ప్రథమ వార్షికోత్సవ ఆరుద్రోత్సవం కార్యక్రమం మేళతాళాలు, అర్చకుల వేదమంత్రోచ్చారణల మధ్య మహా వైభవోపేతంగా జరిగింది. ఏకాదశ రుద్రాభిషేకం ఆవుపాలు 108లీటర్లతో అభిషేకం, గర్భాలయ దీపోత్సవం, పుష్పాలంకరణ, విశేష నీరాజనములు, మంత్రపుష్పము, తీర్థప్రసాద వితరణ చేశారు. ఈసందర్భంగా ఆలయాన్ని వైభవంగా పూలతో అలంకరించారు. ఆరుద్రోత్సవం కార్యక్రమంలో భక్తులు పాల్గొని కనులారా తిలకించి తరించారు. శ్రీరామదాసు భజన మండలి ఆధ్వర్యంలో భజన బృందాలు నిర్వహించిన భజనలు భక్తులను అలరించాయి. ఈకార్యక్రమంలో ఆలయ ఈవో భాగం లక్ష్మీప్రసన్న, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## నేడు జరగబోయే ఎన్నికలకు సర్వం సిద్ధం

పాలకుర్తి, మే 12 ప్రభాతవార్త :



పాలకుర్తి మండలకేంద్రంలో వరంగల్ పార్లమెంట్ ఎన్నికలకోసం పాలకుర్తి సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో ఎన్నికల అధికారులు ఎన్నికల పోలింగ్ సిబ్బందికి ఈవీఎంలను పంపిణీ చేశారు. నియోజకవర్గంలో ఆదివారం పోలింగ్ సిబ్బంది అధికారులు ఈవీఎంలు ఇతర పోలింగ్ సామాగ్రితో సంబంధిత పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు.

## ఎన్నికల విధులలో కేయూ ఉద్యోగులు

ఎడ్యుకేషన్ కేయూ, మే 12 ప్రభాతవార్త :



తెలంగాణ రాష్ట్రంలోని లోకసభ ఎన్నికల విధులలో కేయూ ఉద్యోగులు డాక్టర్ ఆసిమ్ ఇక్బాల్, నాగవెల్లి ఎల్లయ్య, తాటి దామోదర్, సునీల్ కుమార్, బీసీఎం రాజు, మహమ్మద్ మజార్, ఎండి.ఆజామ్, సదయ్య తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంట్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

ఎలిగేడు,ప్రభాతవార్త : నేడు పెద్దపల్లి పార్లమెంటుకు జరగనున్న ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎలిగేడు తహసీల్దార్ జె.స్వర్ణ తెలిపారు. మండలంలో 12 గ్రామాలకు గాను 22 పోలింగ్ బూతులు ఏర్పాటు చేసి ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఆదివారం సాయంత్రం పోలింగ్ సామాగ్రితో ఎన్నికల సిబ్బంది పోలింగ్ బూతులకు చేరుకున్నారు.

## ఎన్నికలకు సర్వం సిద్ధం

తరిగొప్పుల, మే 12 ప్రభాతవార్త : మండలకేంద్రంలోని 15గ్రామపంచాయతీలకు గాను 15,717ఓటర్లు ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఓటింగ్ కొరకు ఎన్నికల అధికారులు మండలంలో 21పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రం పోలింగ్ కేంద్రాలలో ఈవీఎంలను అధికారులు అమర్చారు. సోమవారం ఉదయం 7గంటల నుంచి పోలింగ్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని, ప్రతీ ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని ఎన్నికల అధికారులు తెలిపారు.

## ఫెడరేషన్ కప్‌లో ప్రతిభ చూపిన బాలికలు

బచ్చన్నపేట, మే 12 ప్రభాతవార్త :



నేషనల్ ఆరవ ఫెడరేసన్ పోటీల్లో తెలంగాణ నుంచి బాలికలు పాల్గొని ప్రతిభ చూపి వివిధ రకాల పథకాలను సాధించారు. గోవాలో ఈనెల 10నుంచి 12వరకు జరిగిన పోటీల్లో అండర్ 12బాలికలు రజితం, అండర్ 17బాలురు బ్రాస్, అండర్ 19బాలురు రజితం గెల్చుకుని తెలంగాణ ఖ్యాతిని చాటారు. ఈపోటీల్లో గుజరాత్, హర్యాన, కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, పాండిశ్చేరి, తెలంగాణ రాష్ట్రాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. వారికి కోచ్ నసీర్, మేనేజర్ హేమ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారికి తెలంగాణ బాడీ అసోసియేషన్ అధ్యక్షులు చల్లా శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థుల తల్లిదండ్రులను అభినందించారు. రాబోయే ఒలంపిక్స్, అసియా క్రీడల్లో పాల్గొని తెలంగాణ సత్తాచాటాలని ఆయన ఆకాంక్షించారు.

## ఎంపి ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

బచ్చన్నపేట, మే 12 ప్రభాతవార్త : మండలంలోని అన్ని గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో సోమవారం నిర్వహించనున్న ఎంపీ ఎన్నికల పోలింగ్‌కు గాను సర్వం సిద్ధం చేసినట్లు బచ్చన్నపేట తహసీల్దార్ విశాలాక్షి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 47పోలింగ్ కేంద్రాల్లో సిబ్బందికి తగిన వసతులు కల్పించినట్లు తెలిపారు. అదేవిధంగా గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించామని, పోలింగ్ కేంద్రాలకు వచ్చిన సిబ్బందికి అన్ని సౌకర్యాలు కలిపంచేలా పంచాయతీలు చూసుకున్నాయన్నారు. పారదర్శకంగా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా అన్నిశాఖల అధికారులు సహకారాలు అందించాలన్నారు. బీఎల్ఓలు దగ్గరుండి సిబ్బందికి సహాయ సహకారాలు ఇచ్చేలా ఆదేశాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కారోబార్లు, బీఎల్ఓలు, గ్రామస్థాయి అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, వీవోఏలు, ఆశవర్కర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## యూనివర్శిటీ సాఫ్‌బాల్ జట్టు ఎంపిక

ఎడ్యుకేషన్ కేయూ, మే 12 ప్రభాతవార్త :



కాకతీయ యూనివర్శిటీలో ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటీ సాఫ్ట్‌బాల్ జట్టును ఎంపిక చేసినట్లు కేయూ క్రీడా కార్యదర్శి ఆచార్య వెంకయ్యతెలిపారు. కేయూ పరిధిలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులతో సాఫ్ట్‌బాల్ జట్టును ఎంపికచేశారు. బెంగళూరులోని బెంగళూరు యూనివర్శిటీలో ఈపోటీలు ఈనెల 13నుంచి 18 వరకు జరుగుతాయని వారు తెలిపారు.

# కోట మైసమ్మ దేవాలయానికి సామినేని దంపతుల ఏసీ వితరణ




*కారేపల్లి, మే 12,, ప్రభాతవార్త :*
ఖమ్మం నగరానికి చెందిన సామినేని గంగాధర్ కృష్ణవేణి దంపతులనే సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి గ్రామంలో గల కోట మైసమ్మ దేవాలయ గర్భగుడిలో ఏర్పాటు చేసేందుకు 38 వేల రూపాయలు విలువ చేసే ఏసీ ని వితరణగా అందజేశారు గంగాధర్ దంపతులు కుటుంబ సభ్యులు కోట మైసమ్మ ఆలయం పూజల్లో పాల్గొన్నారు ఆలయ పూజారి కైలాస శర్మ గోత్ర నామార్చన తో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం కోట మైసమ్మ ఆలయ ప్రాంగణంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో దేవాలయ సిబ్బందికి అందజేశారు ఈ కార్యక్రమంలో పర్సా ట్రస్ట్ ఫౌండర్ ట్రస్ట్ ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ పర్సా పట్టాభి రామారావు, ఆలయ కార్య నిర్వహణ అధికారి వేణుగోపాలచార్యులు లు మాట్లాడుతూ శ్రీ కోట మైసమ్మ తల్లి దేవస్థానం అభివృద్ధిలో భక్తులు సైతం తమ వంతు సహాయాన్ని అందిస్తూ అమ్మవారి ఆశీర్వచనాలు పొందుతున్నారని, ఆధ్యాత్మిక చింతనతో సకల సౌభాగ్యాలు కలుగుతాయన్నారు. ఆలయ పరిసరాల్లో భక్తులకు ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాలు సమకూరుస్తున్నామన్నారు దాతలు ఆలయ పరిసరాల అభివృద్ధికి భక్తులు తమ వంతు సహకారం అందిస్తున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ సిబ్బంది భీమవరపు సూర్య ప్రకాష్ రావు, మూడ్ మోహన్ చౌహన్, దాతల కుటుంబ సభ్యులు సామినేని వెంకటేశ్వర్లు, వాణిశ్రీ, భీమవరపు శ్రీనివాసరావు, గాలి రంగారావు, రమాదేవి, వసంత కుమారి తదితరులు పాల్గొన్నారు.




## కారేపల్లి, వైరా, కొణిజర్ల, ఏన్కూరు

## పోలింగ్ కు సర్వం సిద్ధం

### 61 పోలింగ్ కేంద్రాలు 41 వేలకు పైగా ఓట్లు



*కారేపలి, మే 12, ప్రభాతవార్త :*
పార్లమెంట్ ఎన్నికలకు సర్వం సిద్ధం అయ్యాయి. సింగరేణి మండల వ్యాప్తంగా 22178 పురుషులు, 22830 మంది మహిళలు, ముగ్గురు ట్రాన్స్ జెండర్లు మొత్తం 45011 మంది ఓటర్లు ఈ పార్లమెంట్ ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకొనున్నారు. మండల వ్యాప్తంగా 61 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఇప్పటికే మండల అధికారులు పూర్తి చేశారు. 61 పోలింగ్ కేంద్రాలను ఆరు సెక్టార్లుగా విభజించి సెక్టార్కు ఒక అధికారిని కేటాయించారు. ఈ ఎన్నికలకు సంబంధించిన పూర్తి పర్యవేక్షణ ఆయా సెక్టార్ల అధికారులు నిర్వహించనున్నారు. కాగా పటిష్టంగా ఎటువంటి విఘాతం కలగకుండా ఎన్నికలు నిర్వహించేందుకు పోలీసు యంత్రాంగం సైతం సిద్ధమైంది. జిల్లా కమిషనర్ కార్యాలయం నుంచి ప్రత్యేక సిబ్బంది మండలానికి చేరుకొని ఆయన పోలింగ్ కేంద్రాలను తమ అధీనంలోకి తీసుకున్నారు. ఆదివారం సాయంత్రానికి పోలింగ్ కేంద్రానికి సిబ్బంది తమ సామాగ్రితో చేరుకున్నారు. ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ నిర్వహించేందుకు అధికారులు సంసిద్ధులయ్యారు. కాగా పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరం వరకు ఎటువంటి ప్రచారం నిర్వహించరాదని ఇప్పటికి ఎన్నికల అధికారులతో పాటు జిల్లా పోలీస్ కమిషనర్ సైతం పేర్కొన్నారు.

## దుమ్ముగూడెం మండలంలో పోలింగ్‌కు సర్వం సిద్ధం

**-40 పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లను పూర్తి**

**-సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు**



*దుమ్ముగూడెం, ప్రభాతవార్త :*
దుమ్ముగూడెం మండలంలో సోమవారం జరిగే మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు సర్వం సిద్ధం చేశారు. మండలంలోని 40 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు లోక్‌సభ



ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు దుమ్ముగూడెం తహసిల్దార్ చంద్రశేఖర్ విలేకర్లకు తెలిపారు. పోలింగ్ సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారని దుమ్ముగూడెం మండలంలో 40 పోలింగ్ కేంద్రాల్లో 35 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైనవిగా గుర్తించామని, సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలు దృష్టిలో పెట్టుకుని స్వామి వారి ఉపాధి హామీ పనులు నిలిపివేయబడ్డాయని, ఓటర్లందరూ తమ ఓటు హక్కును పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఆదేశాలతో ప్రథమ చికిత్స కిట్లతో పాటు వైద్యఆరోగ్యసిబ్బందిని నియమించామని దుమ్ముగూడెం మండలంలోని 36065 ఓటర్లు ఉండగా, అందులో పురుషులు 17,114, స్త్రీలు 18,949, ఇతరులు ఇద్దరు ఉన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో బూత్ లెవెల్ అధికారితో పాటు ఓటర్ సహాయక కేంద్రం ఏర్పాటు చేసినట్లు దుమ్ముగూడెం తహసిల్దార్ తెలిపారు. పోలింగ్‌కు సర్వం సిద్ధం చేసినట్లు ఓటర్లు ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## వాహన తనిఖీల్లో మూడు లక్షలకు పైగా నగదు స్వాధీనం

### ఇరువురి పై కేసు నమోదు వాహనం సీజ్



*కారేపలి, మే 12, ప్రభాతవార్త :*
సింగరేణి మండలం ఇల్లందు ఖమ్మం ప్రధాన రహదారి మార్గంలో ముత్యాల గూడెం సమీపంలో ఫ్లయింగ్ స్క్వాడ్ మూడు లక్షల రూపాయల నగదు కారును స్వాధీనం చేసుకున్నారు కారేపల్లి ఎస్సై రాజారాం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి సింగరేణి మండలానికి చెందిన ఇరువురు వ్యక్తుల వద్ద నుండి కారు మూడు లక్షల 46,500 నగదు లభించాయి కారులో బిజెపీ పార్టీ కరపత్రాలు జెండాలు ఉన్నాయి. స్వాధీనం చేసుకున్న నగదును కారును ఎన్నికల నియమాలు ప్రకారం సీజ్ చేసి కోర్టుకు అప్పగించనున్నట్లు తెలిపారు దీనికి సంబంధించి ఫ్లయింగ్ స్క్వాడ్ నవీన్ బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

## ఎమ్మెల్యే చొరవతో ఓటింగ్‌లో పాల్గొననున్న గ్రామస్తులు



*దుమ్ముగూడెం, ప్రభాతవార్త :*
దుమ్ముగూడెం మండల పరిధిలోని అచ్యుతాపురం గ్రామస్తులు పార్లమెంట్ ఎన్నికల్లో పాల్గొనబోమని గత రెండు రోజుల క్రితం తీర్మానించుకున్నారు. గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేక ఎన్నో సంవత్సరాలుగా గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నా ప్రజాప్రతినిధులు కానీ, అదికారులు కానీ పట్టించుకోవడం లేదని, అందుకు నిరసనగా పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు గ్రామస్తులు గత రెండు రోజుల క్రితం తెలిపారు. దీంతో స్పందించిన భద్రాచలం ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు ఆదివారం అచ్యుతాపురం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలతో, గ్రామస్తులతో మాట్లాడారు. ఎన్నికల ముందు హామీలు ఇచ్చి తరువాత సమస్యలు విస్మరిస్తున్నారని గ్రామస్తులు భీష్మించుకుని కూర్చున్నారు. దీంతో భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావు గ్రామస్తులకు హామీ ఇచ్చి గత రెండు నెలలుగా ఎన్నికల కోడ్ ఉన్నందున రహదారి నిర్మాణం చేపట్టలేకపోయామని, పార్లమెంట్ ఎన్నికల తదానంతరం రహదారి పనులు పూర్తి అయ్యేలా చర్యలు చేపడతామని పూర్తి బాధ్యత నాది అని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని గ్రామస్తులకు ఆయన విజ్ఞప్తి చేశారు. దీంతో సానుకూలంగా స్పందించిన గ్రామస్తులు ఎమ్మెల్యే మాటకు విలువ ఇస్తూ ఓటింగ్ పాల్గొంటామని ఆయన హామీ ఇచ్చారు.

## సాయి బాబా ఆలయంలో ముగిసిన వార్షికోత్సవ వేడుకలు



*కారేపల్లి, మే 12,, ప్రభాతవార్త :*
మండల కేంద్రమైన కారేపల్లి లోని సాయిబాబా ఆలయంలో 25 వార్షికోత్సవ సందర్భంగా చివరిరోజైన ఆదివారం సాయిబాబా భక్త మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, మహా అన్నదానం నిర్వహించారు. అర్చకులు నాగసాయి శర్మ ఆధ్వర్యంలో వేద పండితులచే మూల మంత్ర హోమాలు, పూర్ణాహుతి, ఆలయ శిఖరాభిషేకం తో పాటు సాయిబాబాకు ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్యహించారు ఈ కార్యక్రమంలో యలమంచిలి సూర్యనారాయణ, నేదునూరి నరేష్, నేదనూరి విఠల్ దుగ్గినేని హనుమంతరావు, బుచ్చిబాబు, ఇందుర్తి సురేందర్ రెడ్డి, సూర్యదేవర వెంకటేశ్వర్లు సురేందర్ మనియార్, రాము ధరక్, చౌడవరపు రమేష్, చిన్ని శ్రీనివాసరావు, పర్సా సనత్ కుమార్, ప్రసాదు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.




సత్తుపల్లి, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూర్

# నేటి పోలింగ్‌కు సర్వం సిద్ధం

### కేంద్రాలకు తరలివెళ్లిన ఎన్నికల సామాగ్రి

### బూత్‌లకు లైవ్ వెబ్‌కాస్ట్‌లు ఏర్పాటు

*సత్తుపల్లి, మే 12, ప్రభాతవార్త:*

ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గానికి సోమవారం జరగనున్న పోలింగ్‌కు సత్తుపల్లి నియోజకవర్గవ్యాప్తంగా 294 పోలింగ్ బూత్‌లకు ఎన్నికల సామాగ్రిని ప్రత్యేక వాహనాల ద్వారా ఎన్నికల సిబ్బందితో ఆదివారం తరలించడం జరిగింది. నియోజకవర్గవ్యాప్తంగా ఐదు మండలాల్లో 2 లక్షల 43 వేల 943





మంది ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. సత్తుపల్లి పట్టణంలోని జ్యోతి నిలయం స్కూల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ నుండి ఈవిఎంలు,వివిపి ప్యాడ్‌లు, ఎన్నికల సామాగ్రిని నియోజకవర్గ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేక బస్సుల ద్వారా సామాగ్రితో పాటు ఎన్నికల సిబ్బందిని పింపించినట్లు ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి, కల్లూరు ఆర్డీవో ఎల్. రాజేందర్ గౌడ్ తెలిపారు. నియోజకవర్గంలో ఓటర్లు నూటికి నూరు శాతం ఓట్లు వేసేందుకు ఏర్పాట్లు చేయడం జరిగిందని అన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని 294 పోలింగ్ బూత్‌లకు 1441 మంది ఎన్నికల సిబ్బంది విధులు నిర్వహించనున్నారని, వీరందరినీ ఎన్నికల సామాగ్రితో 70 ప్రత్యేక బస్సుల ద్వారా బూత్‌లకు తరలించడం జరిగిందని అధనంగా మరో 10 బస్సులు కూడా సిద్ధం చేసి ఉంచినట్లు రాజేందర్ గౌడ్ తెలిపారు.

***ప్రతి బూత్‌కు లైవ్ వెబ్‌కాస్ట్ :***

నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఏర్పాట్లు చేసిన 294 పోలింగ్ కేంద్రాల్లో ప్రతి బూత్‌లో లైవ్ వెబ్‌కాస్ట్‌ను ఏర్పాటు చేసి వీటన్నింటికి అనుసంధానంగా జ్యోతి నిలయం స్కూల్లో రిమోట్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని ఆర్డీవో ఎల్. రాజేందర్ గౌడ్ తెలిపారు. ఆయా పోలింగ్ బూత్‌లలో ఏ సమయంలో ఏం జరుగుతుందో క్షణాల్లో ఈ కంట్రోల్ రూమ్ నుండి తెలుసుకోవచ్చని, అక్కడ ఏ సమస్య ఉన్నా వెంటనే పరిష్కారానికి వీలు పడుతుందని ఆయన అన్నారు. తాను అనుక్షణం ఈ కంట్రోల్ రూమ్ ద్వారా పోలింగ్ బూత్‌లను పర్యవేక్షిస్తుంటానని ఆయన అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 33 మంది కేంద్ర ప్రభుత్వ శాఖలకు చెందిన మైక్రో అబ్జర్వర్స్ నిత్యం కేంద్రాల్లో పర్యవేక్షిస్తుంటారని ఆయన అన్నారు. పోలింగ్ ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుందని పోలింగ్ అనంతరం పోలింగ్ బాక్స్‌లను కట్టుదిట్టమైన పోలీస్ భద్రత మధ్య ఖమ్మం స్ట్రాంగ్ రూమ్‌కు తరలించడం జరుగుతుందని ఆర్డీవో రాజేందర్ గౌడ్ తెలిపారు.

# లారీలకు బొగ్గు లోడింగ్ రవాణా కల్పించండి

## 40 శాతం బొగ్గు తగ్గకుండా రవాణా కల్పించండి

### లారీ టిప్పర్స్ ఓనర్స్ అసోసియేషన్

*సత్తుపల్లి, మే 12, ప్రభాతవార్త:*



సత్తుపల్లి ఓపెన్ కాస్టు గనులలో ఉత్తత్తి అవుతున్న బొగ్గును ఇతర ఫ్యాక్టరీలకు రవాణా చేయడానికి అనుమతులు ఇవ్వాలని సింగరేణి సంస్థ యాజ మాన్యానికి సత్తుపల్లి లారీ టిప్పర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కోరింది.

సత్తుపల్లి పట్టణంలోని జేవీఆర్ పార్కువద్ద లారీ ఆఫీస్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ సింగరేణి ఓపెన్ కాస్టు గనుల మూలంగా అనేక రకాలుగా తాము నష్టపోయి ఫైనాన్స్‌లో లారీలు తెచ్చుకొని నడుపుకుంటున్నామని, సింగరేణి సంస్థ రైలు మార్గం ద్వారా బొగ్గు రవాణా చేస్తూ లారీలకు లోడింగ్ తగ్గించి మా కడుపులు కొడుతుందని, ఇలా అయితే మాకు ఆత్మహత్యలే శరణ్యమని లారీ అసోసియేషన్ ఆవేధన వ్యక్తం చేసింది. అసోసియేషన్ లారీలకు 40 శాతం నాణ్యతతో కూడిన బొగ్గు లోడింగ్ ఇప్పించాలని, ప్రస్తుతం నాణ్యమైన బొగ్గును ఇవ్వనికారణంగా ఫ్యాక్టరీలను పర్మిట్‌ను కాన్సల్ చేస్తున్నాయని, ఈ విషయం సింగరేణి అధికారుల దృష్టికి అనేకమార్లు తీసుకొచ్చినా చర్యలు తీసుకోకపోగా, పర్మిట్స్ తెచ్చుకుంటే బొగ్గు ఇస్తామని చెబుతున్నారని అన్నారు. గతంలో తామెప్పుడు పర్మిట్ తెచ్చుకోలేదని సింగరేణి యాజమాన్యం వివిధ ఏరియాల్లో గల ఫ్యాక్టరీ యాజమాన్యాలతో మాట్లాడి వారు తమ వద్ద ఖరీదు చేసిన నాణ్యమైన బొగ్గును అందించి మాకు 40 శాతం లోడింగ్ ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో లారీ టిప్పర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండపల్లి రమేష్‌రెడ్డి, సెక్రటరీ కె.విశ్వనాథం, పిఎల్. ప్రసాద్, నజీర్, కోటిరెడ్డి, చెన్నాచారి, విజయ్ కుమార్, ఎస్‌కె. రహీమ్, రెహమాన్, లియాకత్ తదకితరులు పాల్గొన్నారు.

### శ్రీశ్రీ రవిశంకర్ గురూజీ జన్మదిన వేడుకలు

*ఖమ్మం కల్చరల్, మే 12, ప్రభాతవార్త:*

నగరంలోని వీడియోస్ కాలనీ సాయిబాబా ద్యాన మందిరం నందు ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు శ్రీశ్రీ రవిశంకర్ గురూజీ బర్త్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం యోగ ప్రాణామయం, సుదర్శన్ క్రియ, మెగా రక్తదాన శిభిరాన్ని నిర్వహించారు. ఈ రక్తదాన శిభిరంలో సుమారుగా 40 మంది దాకా రక్తదాతలు పాల్గొని విజయవంతం చేశారు. అలాగే సాయంత్రం గురుపూజ, భక్తిభజన కార్యక్రమం



నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్స్ వెంకట్, కోటేశ్వరరావు, శ్రీనివాస్, వాలంటీర్స్, వెంకట్‌రెడ్డి, శ్రీలత, సత్యవతి, గోపాల్, హరి, రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

### ఆదర్శంగా తీర్చిదిద్దిన మహిళా పోలింగ్ కేంద్రం



*తల్లాడ, మే 12, ప్రభాతవార్త*

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మండల కేంద్రమైన తల్లాడలోని 18వ పోలింగ్ బూత్‌ను మహిళా ఆదర్శ పోలింగ్ కేంద్రంగా తీర్చిదిద్దారు. ఎలక్షన్ కమీషన్ ఆదేశాల మేరకు ఎంపిడిఓ ఎం. చంద్రమౌళి, ఎంపిఓ



కొండపల్లి శ్రీదేవిలు దగ్గరుండి అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా 100 సంవత్సరాలు నిండిన వృద్ధ మహిళలను ఓటింగ్ రోజైన సోమవారం మహిళల చేత స్వాగతం పలికి, సన్మానించే కార్యక్రమానికి కూడా ఏర్పాట్లు చేశారు. ఇదిలా ఉండగా తహశీల్దార్ వి. రవికుమార్, ఎస్సై బి. కొండలరావు, క్లస్టర్ అధికారి ఎండి. తాజుద్దీన్‌లు పోలింగ్ సిబ్బందిని సత్తుపల్లి నుండి ఆయా పోలింగ్ స్టేషన్లకు తరలించారు.

### మాజీ నీటి సంఘం అధ్యక్షుడు నల్లబోతు రామారావు మృతి

*తల్లాడ, మే 12, ప్రభాతవార్త*



ముద్దునూరు నీటి సంఘం మాజీ అధ్యక్షుడు నల్లబోతు రామారావు (65) గుండెపోటుతో మృతిచెందారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఇంటికి వెళ్ళి ఛాతీ నొప్పికు గురవ్వగా తన అనుచరులు ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో మృతిచెందారు. ఆయన భార్య పద్మావతి మొన్నటి వరకు కుర్నవల్లి సొసైటి చైర్మన్‌గా పని చేశారు. రామారావు కూడా గతంలో నీటి సంఘం అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీలో మండల స్థాయి నాయకుడిగా పనిచేస్తున్నారు. రామారావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మరణ వార్త తెలియగానే మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్, దగ్గుల రఘుపతిరెడ్డి, దుండేటి వీరారెడ్డి, అన్నెం కోటిరెడ్డి, అయిలూరి వెంకట కోటారెడ్డి, గంటల వెంకటాచారి, ఇనపనూరి సీతయ్య తదితరులు రామారావు పార్ధీవదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

### భారీ వర్షానికి నేలకూలిన షామీయానాలు

*తల్లాడ, మే 12, ప్రభాతవార్త*



సోమవారం జరిగే ఎన్నికలకు అధికారులు పాఠశాల ఆవరణలలో షామీయానాలు ఏర్పాటు చేయగా ఆదివారం సాయంత్రం అకాల వర్షానికి నేలకూలాయి. అధికారులు పోలింగ్ కేంద్రాలను అందంగా తీర్చిదిద్దగా వర్షానికి టెంట్లు నేలకూలడంతో పాటు పాఠశాల ఆవరణ మొత్తం నీరు చేరడంతో సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఎంపిడిఓ ఎం. చంద్రమౌళి జిల్లా కలెక్టర్‌కు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది.




నేలకొండపల్లి, ఖమ్మం రూరల్, కూసుమంచి, తిరుమలాయపాలెం

# నెలనెలా వైద్య శిబిరం విజయవంతం

*నేలకొండపల్లి, మే 12 ప్రభాతవార్త:* అమరజీవి నూతక్కి గంగాధరరావు సేవా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నేలకొండపల్లి లోని రావెళ్ళ భవన్ నందు ఉచితంగా నిర్వహించిన 17వ నెలనెలా వైద్య శిభిరం సంపూర్ణంగా విజయవంతమైంది. ఈ వైద్య శిభిరంలో దాదాపు 128 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిభిరంలో ప్రముఖ జీర్ణకోశ వ్యాధి నిపుణులు డాక్టర్ సి.భారవి ఎంబిబిఎస్, ఎండి, డిఎం, ప్రముఖ జనరల్ వైద్యులు డాక్టర్ కొల్లి అనుదీప్, డాక్టర్ హస్నద్‌బాబా ఎంబిబిఎస్ రోగులకు వైద్య సేవలను అందించారు. ఈ శిభిరంలో షుగర్, బిపి రోగులకు వంద రూపాయలకే నెలకు సరిపడా మందులు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఎన్‌జిఆర్ సేవా కమిటి కన్వీనర్ ఏటుకూరి రామారావు మాట్లాడుతూ సిపిఎం పార్టీ ఉద్యమాలకే పరిమితం కాకుండా అనేక సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ ఉచిత వైద్య శిభిరానికి విశేషంగా స్పందన లభించిందని



ఆయన చెప్పారు. వైద్య శిభిరంను విజయవంతం చేసిన వైద్యులు, సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ వైద్య శిభిరం లో గ్రామీణ వైద్యులు బండారుపల్లి నాగేశ్వరరావు, బండి పుష్పలత, తానీషా, వసుంధర ఒకేషనల్ కళాశాల ప్రిన్స్‌పాల్ ఈగ అనీల్‌కుమార్, విద్యార్థులు రోగులకు ఇతరత్రా సేవలతో పాటు మందులు పంపిణీ, రక్త పరీక్షలు చేసారు. ఈ కార్యక్రమంలో అమరజీవి నూతక్కి గంగాధరరావు సేవా కమిటీ కన్వీనర్ ఏటుకూరి రామారావు, సేవా కమిటి బాధ్యులు, సిపిఎం జిల్లా కమిటి సభ్యులు గుడవర్తి నాగేశ్వరరావు, మండల సిపిఎం కార్యదర్శి కేవి రామిరెడ్డి, నాయకులు కట్టెకోల వెంకటేశ్వర్లు, సిరికొండ ఉమామహేశ్వరి, దండా సూర్యనారాయణ, షేక్.అబ్దుల్, ఎస్.కే.రహీం, మంకెనపల్లి నరసింహరావు, ఏలూరి కోందడరామారావు, దండా సైదారావు, సుడిగాలి సతీష్, సామాల మల్లిఖార్జునరావు, డి.నాగేశ్వరరావు, బొడ్డు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# కామేపల్లిలో ఎన్నికలకు సర్వం సిద్ధం

### ఓటు హక్కును వినియోగించుకోనున్న 35,159 మంది ఓటర్లు

*కామేపల్లి, మే 12 ప్రభాతవార్త:* ప్రతిష్టాత్మకంగా సోమవారం జరగనున్న మహబూబాబాద్ నియోజకవర్గ పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు కామేపల్లి మండలంలో అన్ని ఏర్పాట్లను అధికార యంత్రాంగం ఆదివారమే పూర్తి చేసింది.మండలంలో మొత్తం 24 గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేసిన 36 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 35,159 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తహశీల్దార్ సిహెచ్ సుధాకర్ తెలిపారు.వారిలో 17,252






మంది పురుష ఓటర్లు, 17,907 మంది మహిళ ఓటర్లు ఉన్నట్లు తెలిపారు.పురుష ఓటర్ల కన్నా మహిళా ఓటర్లే మండంలో ఎక్కువ సంఖ్యలో ఓటు హక్కును వినియోగించుకోనున్నారని చెప్పారు. దివ్యాంగులు, వయోవృద్ధుల సౌకర్యార్ధం పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులను కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.వారిని పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లేందుకు ట్రైసైకిళ్లను కూడా ఏర్పాటుచేయడం జరిగిందన్నారు.పోలింగ్ అధికారులు, సిబ్బంది ఇప్పటికే సామాగ్రితో కేంద్రాలకు చేరుకోవటం జరిగిందన్నారు.పోలింగ్ సిబ్బందితోపాటు ఓటర్లు కేంద్రాల వద్ద అసౌకర్యానికి లోను కాకుండా వేసవి కాలం దృష్ట్యాతాగునీరు, విద్యుత్, వైద్యం, మూత్రశాలల సదుపాయం కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ప్రతి ఓటరు తమ అమూల్యమైన ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకావద్దని కోరారు. పోలింగ్ ను ప్రశాంతంగా కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవటం జరిగిందన్నారు.కాగా పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు సింగరేణి రూరల్ సిఐ బి.తిరుపతిరెడ్డి, ఎస్సై పి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో జి.రవీందర్, పంచాయితీ కార్యదర్శులు పెండ్ర అనిల్‌కుమార్, హట్కర్ పార్వతి, సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీస్ పహారా నడుమ కామేపల్లి

### అతి సమస్యాత్మక గ్రామాల్లో సాయుధ బలగాల బందోబస్తు

*కామేపల్లి, మే 12 ప్రభాతవార్త:* కామేపల్లి మండలంలో సోమవారం పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌ను నిర్వహిస్తుండటంతో పోలీసులు గ్రామాల్లో ఆదివారమే మకాం వేసి భారీగా బందోబస్తు నిర్వహిస్తున్నారు.పోలింగ్‌ను ప్రశాంతంగా పకడ్బందీగా నిర్వహించేందుకు గాను ముందస్తుగానే మకాం వేసి బందోబస్తు చర్యలను చేపడుతున్నారు.అతి సమస్యాత్మక గ్రామాలైన పండితాపురం,బర్లగూడెం, గోవింద్రాల, ముచ్చర్ల



తదితర గ్రామాల్లో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశారు.పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు సిఐ బి.తిరుపతిరెడ్డి, ఎస్సై పి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు.మండల పరిధిలోని 24 గ్రామ పంచాయతీల్లో ఏర్పాటుచేసిన 36



పోలింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.పోలింగ్‌కు రెండు రోజుల ముందు నుండే మద్యం, బెల్ట్ షాపులను మూసివేయటం జరిగిందన్నారు.రౌడీ షీటర్లను కూడా బైండోవర్ చేసిన్నట్లు చెప్పారు.ప్రతి గ్రామంలో భారీగా పోలీస్ సిబ్బంది సాయుధ బలగాలతో కవాతును కూడా నిర్వహించటం జరిగిందన్నారు.పోలింగ్ ప్రక్రియను మొత్తం వెబ్‌కాస్టింగ్ చేయనున్నట్లు చెప్పారు.ప్రతి ఓటరు విధిగా ఓటు హక్కు ను వినియోగించుకోవాలని కోరారు.ఎలాంటి ప్రలోభాలకు లోనుకావద్దని కోరారు.ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినా శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు.పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు ఓటర్లు, అభ్యర్థులు,రాజకీయపక్షాలు సహకరించాలని కోరారు.నిబంధనలకు లోబడి నడుచుకోవాలన్నారు.నిబంధనలను అతిక్రమిస్తే ఎంతటివారిపైనైనా చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు.100 మంది పోలీసులతో బందోబస్తు ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## ఘనంగా శ్రీఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలు



*నేలకొండపల్లి, మే 12 ప్రభాతవార్త:* పరమహంస, జగద్గురు శ్రీఆదిశంకరాచార్యుల జయంతిని పురస్కరించుకుని ఆదివారం నేలకొండపల్లి లోని శ్రీపార్వతి సమేత ఉత్తరేశ్వరస్వామి దేవాలయం నందు శ్రీఆదిశంకరచార్యుల జయంతి ఉత్సవాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీఆదిశంకరాచార్యుల విగ్రహం వద్ద అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీపార్వతి సమేత ఉత్తరేశ్వరస్వామి దేవాలయం అర్చకులు శివయ్య, మారుతి చంద్రమౌళి, జక్కేపల్లి పాపయ్యశాస్త్రి, గండికోట వేణుమాధవ్ పలువురు భక్తులు పాల్గొన్నారు.

## ఓటర్లకు పంపిణీ చేస్తున్న రూ 4 లక్షలు సీజ్

### ఎంపీపీతో పాటు, మరో ఇద్దరిపై కేసు నమోదు

*ముదిగొండ, మే 12, ప్రభాతవార్త :* పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నామ నాగేశ్వరరావుకు ఓట్లు వేయాలని మండలపరిధిలో మేడేపల్లిలో ఎంపీపీ సామి నేని హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఖమ్మంకు చెందిన ఎస్కె పాష, ముదిగొండకు చెందిన గుంటి నరేష్ అనే ఇద్దరు వ్యక్తులు ఓటర్ లిస్ట్ ప్రకారం శనివారం రాత్రి ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తుండగా ఫ్లయింగ్ స్కాడ్ అధకారులు రూ 4,29,500 తో పాటు, ఓటర్ లిస్టును స్వాధీనం చేసుకుని సీజ్ చేసి, ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గజ్జెల నరేష్ ఆదివారం తెలిపారు.పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్. ఎస్సై నరేష్ నవ తెలంగా ముదిగొండ మండలంలో సోమవారం జరిగే పార్లమెంటు ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉందని ఎస్సై గజ్జెల నరేష్ ఆదివారం తెలిపారు. పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో గుంపులు గుంపులుగా తిరగరాదని, ఎవరైనా ఎన్నిక నిబంధనలను ఉల్లంఘించినచో కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. పార్లమెంటు ఎన్నికల పోలింగ్ ను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ బలగాలచే పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు.

# పోలింగ్‌కు సర్వం సన్నద్ధం

**పోలింగ్ సామాగ్రి పంపిణీ పూర్తి**

**ఉభయ జిల్లాలో మహిళ ఓటర్లే కీలకం**

**పటిష్ట పోలీస్ బందోబస్తు నడుమ ఎన్నిక**

**చత్తీస్‌ఘడ్ సరిహద్దుల్లో ప్రత్యేక పోలీస్ బృందాల పహారా**



**ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త:**

పోలింగ్‌కు ఉమ్మడి జిల్లా ఎన్నికల అధికార యంత్రాంగం సర్వం సన్నద్ధమైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నిర్వహించనున్న పోలింగ్‌కు ఎన్నికల అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ఆదివారం పోలింగ్‌కు సంబంధించిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి ఎన్నికల సిబ్బందికి సామాగ్రిని పంపిణీ చేశారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ప్రత్యేక పోలీస్ సిబ్బంది నడుమ పోలింగ్ కేంద్రాలకు ఈవిఎంలను తరలించారు. లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని సోమవారం జరగనున్న పార్లమెంట్ ఎన్నికకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో 18,46,609 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 10 నియోజకవర్గాలకు సంబంధించి పురుష ఓటర్లు 10,69,928 మంది, స్త్రీలో 11,42,534కాగా 56,589 మంది పురుష ఓటర్ల కంటే మహిళ ఓటర్లు అధికంగా ఉన్నారు.దీంతో ఉభయ జిల్లాలో మహిళా ఓటర్ల తీర్పు కీలకం కానుంది. ప్రధానంగా ఖమ్మం జిల్లాలోని ఖమ్మం నియోజకవర్గంలో 324073 మంది ఓటర్లు, పాలేరులో 240806 మంది, మధిరలో 222160 మంది, వైరాలో 193389 మంది, సత్తుపల్లిలో 243943 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో మొత్తం ఓటర్లు 1224371కాగా, పురుషులు 590302, మహిళ ఓటర్ల 633984 మంది ఉన్నారు.ఖమ్మం జిల్లాలో 5 నియోజకవర్గాల్లో పురుష ఓటర్ల కంటే మహిళ ఓటర్లు 43,682 మంది అధికంగా ఉన్నారు. ఈ ఐదు నియోజకవర్గాల్లో మహిళ ఓటర్లు అధికంగా ఖమ్మం ఆసెంబ్లీ నియోజకవర్గంలో 13,456మంది మహిళ ఓటర్లు ఉండటం విశేషం.

**- భద్రాద్రి కొత్తగూడెంలో -**

అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పినపాక నియోజకవర్గంలో 203790 మంది ఓటర్లు, ఇల్లందులో 225097 మంది, భద్రాచలంలో 152683 మంది, కొత్తగూడెంలో 247494 మంది, అశ్వారావుపేటలో 159174 మంది చొప్పున మొత్తం 988238 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. భద్రాద్రి జిల్లాలో పురుష ఓటర్లు 479626, మహిళ ఓటర్లు 506550 మంది ఉన్నారు. ఇక్కడ కూడా 28వేల924 మంది మహిళ ఓటర్లే అధికం. దీంతో ఉభయ జిల్లాలో మహిళా ఓటర్లు ఇచ్చే తీర్పు కీలకం కానుంది. ఉభయ జిల్లాలోని 10 నియోజకవర్గాల్లోను పురుషుల కంటే మహిళ ఓటర్లు అధికంగా ఉండటం గమనార్హం.

**- ఉభయ జిల్లాల పోలింగ్ కేంద్రాలు -**

ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఖమ్మం జిల్లాలో 1450 పోలింగ్ కేంద్రాలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1105 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు ఖమ్మం జిల్లాలో 27ఎఫ్‌ఎస్టీ, 21ఎస్‌ఎస్టీ, 31ఎన్‌సీసీ బృందాలు 203 మంది సెక్టార్ అధికారులు ఆరు రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు.ఉభయ జిల్లాల వ్యాప్తంగా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు అన్ని ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించినట్లు ఖమ్మం సీపీ సునీల్‌దత్, భద్రాద్రి జిల్లా ఎస్పీ బి.రోహిత్‌రాజ్ ప్రకటనలో తెలిపారు. ఖమ్మం జిల్లాలో 209 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, భద్రాద్రి జిల్లాలో 169 పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు వారు తెలిపారు. ప్రధానంగా చత్తీస్‌ఘడ్, మన రాష్ట్ర సరిహద్దుల్లో ఆవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీస్ బలగాలతో పహారా కాస్తున్నారు.



**- నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో పటిష్ట బందోబస్తు -**

చత్తీస్‌ఘడ్ సరిహద్దు నుంచి భద్రాద్రి జిల్లాలోని మావోయిస్టు దళాలు చొచ్చుకు రాకుండా, గట్టి పోలీస్ నిఘాను ఏర్పాటు చేశారు. మావోయిస్టులు ఎన్నికల బహిష్కరణ పిలుపునివ్వడంతో, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పోలీంగ్ ప్రశాంతంగా జరిగేలా ఓటర్లు స్వచ్ఛందంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రత్యేక పోలీస్ బృందాలు, సీఆర్పీఎఫ్ బలగాలు, స్పెషల్ సెక్యూరిటీ ఫోర్స్‌ను ఎన్నికల యంత్రాంగం ఏర్పాటు చేశారు.

**- భద్రాద్రిలో 4గంటల వరకు పోలింగ్ -**

భద్రాద్రి జిల్లాలో నర్సల్స్ ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. నాలుగు గంటల వరకు పోలింగ్ కేంద్రాల్లో ఉన్న ఓటర్లను ఓటింగ్‌కు పోలింగ్ సిబ్బంది అనుమతించనున్నారు. ఖమ్మం జిల్లాలోని 5 పోలింగ్ కేంద్రాల్లో 2గంటల వ్యవది పెంచుతూ ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ జరగనుంది.

## ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ



**కొత్తగూడెం క్రైం, మే 12 - ప్రభాతవార్త:**

కొత్తగూడెం రామచంద్ర డిగ్రీ కాలేజీలో ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు సందర్శించారు. రూట్ మొబైల్స్, పోలింగ్ కేంద్రాల వద్ద విధులకు హాజరయ్యే పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎవరికి కేటాయించిన విధులను వారు బాధ్యతగా నిర్వర్తించి పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు కృషి చేయాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అనుమానితులు ఎవరైనా ఉన్నా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని అన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.



## ఓటుహక్కును బాధ్యతగా భావించాలి : కలెక్టర్ ప్రియాంక అలా

**కొత్తగూడెం కలెక్టరేట్, మే12 - ప్రభాతవార్త:**



పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుహక్కును కలిగిఉన్న వారందరూ వారి హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా పిలుపునిచ్చారు. పౌరులు ఓటుహక్కుతో సమర్ధవంతమైన నాయకులను ఎన్నుకుని తద్వార మెరుగైన సమాజాన్ని సాధించే అవకాశాన్ని రాజ్యాంగం ప్రజలకు కల్పించిందన్నారు. జిల్లాలో వందశాతం ఓటింగ్ జరిగేలా అర్హులంతా ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, ఫ్యాన్లు, షామియానాలు, వాష్‌రూంల వంటి సదుపాయాలను కల్పించామన్నారు. జిల్లాలో సోమవారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా సాగేలా అన్ని ఏర్పాట్లను చేశామన్నారు. జిల్లా ఓటర్లు స్వేచ్ఛగా వారి ఓటుహక్కును వినియోగించుకోవాలని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో కలెక్టర్ కోరారు.

### డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సామాగ్రి పంపిణి కేంద్రాన్ని కలెక్టర్ ప్రియాంక ఆల పరిశీలించారు. ఆదివారం కొత్తగూడెం రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించి కలెక్టర్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతు కొత్తగూడెం నియోజకవర్గంలోని 253 పోలింగ కేంద్రాలకు 1212 ఎన్నికల సిబ్బందిని కేటాయించామన్నారు. వీరిలో

పీవోలు 303, ఏపీవోలు 303, ఓపీవోలు 606మంది ఉన్నారన్నారు. పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది, సామాగ్రిల తరలింపుకు 49 బస్సులను అందుబాటులో ఉన్నాయని అదనంగా మరొక 3బస్సులను కేటాయించామన్నారు. ఉదయం 7గంటల నుంచి ఎన్నికల సిబ్బందికి సామాగ్రి పంపిణి కార్యక్రమం ప్రారంభమైందని, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో సిబ్బందికి తాగునీరు, భోజనాలు, షామియానాలు, వైద్యశిబిరాలను ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. పీవోలు, ఏపీవో బృందాల హాజరుపై కలెక్టర్ ఆరా తీశారు. పొరపాట్లకు తావులేకుండా సామాగ్రిని అందించాలని, చెక్‌లిస్ట్ ఆధారంగా సిబ్బంది పోలింగ్ సామాగ్రిని పరిశీలించుకోవాలని సూచించారు. వాహనాలను పరిశీలించారు. నిర్దేశిత సమయానికి పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన తక్షణమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు.

## ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ

**-సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులు నిషేధం**

**-మణుగూరులో ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

**మణుగూరు, ప్రభాతవార్త, మే 12**



నేడు జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది ఓటు వేసేందుకు వచ్చే ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేస్తారని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. ఆయన ఆదివారం మణుగూరు జెడ్పీ కో ఎడ్యూకేషన్ హై స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లోకి సెల్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులతోపాటు మండే వస్తువులు అగ్గిపెట్టె, లైటర్ వంటి నిషేధమని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అనుమాస్పదంగా ఎవరైనా కనిపించిన, ఏమైన సమస్య తలెత్తిన వెంటనే స్థానిక పోలీస్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు డీఎస్పీ వి.రవీందర్‌రెడ్డి, సీఐ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.